

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం

27 జనవరి 2026    పేజీలు : 08








# ప్రగతి పథంలో నెల్లూరు జిల్లా

- 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల
- ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన
- అలరించిన చిన్నారుల నృత్యాలు
- ఆస్తులు పంపిణీ చేసిన కలెక్టర్
- పలువురికి ప్రశంసా పత్రాలు అందజేత

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :**

నెల్లూరు జిల్లా సమగ్ర అభివృద్ధి దిశగా పయనిస్తుందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పేర్కొన్నారు. నెల్లూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు. జిల్లాలోని అన్ని రంగాలు అభివృద్ధి పథంలో ఉన్నాయని వివరించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎనలేని త్యాగాలు చేసిన స్వాతంత్ర్య సమర యోధులకు భారత రాజ్యాంగ నిర్మాతలకు తన జోహార్లని తెలిపారు. 1950 జనవరి 26న మన దేశ చరిత్రలో అతి ముఖ్యమైన రోజని అహింసయే ఆయుధంగా మన జాతిపిత మహాత్మా గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, సుభాష్ చంద్రబోస్, టంగుటూరి ప్రకాశం పంతులు, అల్లూరి సీతారామరాజు, శ్రీ పొట్టి శ్రీరాములు లాంటి ఎందరో మహానుభావుల పోరాట ఫలితంగా 1947 ఆగష్టు 15వ తేదిన మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగం 1950 జనవరి 26 నుండి అమలులోకి వచ్చిందన్నారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఈ రోజున మనమంతా "గణతంత్ర దినోత్సవం"ను జరుపుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో సాధించిన వివిధ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిని వివరించారు. దేశానికి రైతే వెన్నెముక. మన అందరికి అన్నం పెట్టే అన్నదాత.. అటువంటి రైతులు కష్టాల్లో ఉన్నారని తెలుసుకుని, వారిని ఆదుకోవడాని ప్రభుత్వం అన్ని విధాలుగా ముందడుగు వేస్తోందన్నారు. అందులో భాగంగా.. రబీ సీజనులో 4,51,470 ఎకరాల సాధారణ విస్తీర్ణం కాగా 3,14,000 ఎకరాలలో వరి పంట, మిగిలిన విస్తీర్ణములో ఇతర పంటలు సాగు చేయడం జరిగిందన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా రూ.6.39 కోట్ల సబ్సిడీతో 12,948 క్వింటాళ్ల నాణ్యమైన వివిధ రకాల విత్తనాలను 28,685 మంది రైతులకు, అలాగే 1,92,732 టన్నుల ఎరువులను రైతులకు సరఫరా చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలోనే తొలిసారిగా వ్యవసాయ వాటి అనుబంధ శాఖల ద్వారా ప్రతి గ్రామ పంచాయతీ నుండి ఛాంపియన్ ఫార్మర్స్‌ను గుర్తించి, వారు ఆచరిస్తున్న నూతన పద్ధతులను ఇతర రైతులు అనుసరించేలా

-మిగతా 3లో

## టెంపుల్ టూరిజం అభివృద్ధికి
# ప్రత్యేక కృషి

**రాష్ట్రస్థాయిలో తొలిసారిగా రూపొందించిన టెంపుల్ కారవ్యాన్‌ను ప్రారంభించిన మంత్రి ఆనం**



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :**

భక్తులకు సకల సౌకర్యాలతో రూపొందించిన కారవాన్ వాహనాన్ని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించారు. సోమవారం ఉదయం నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో పర్యాటకశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే తొలిసారిగా రూపొందించిన ఈ కారవాన్‌ను మంత్రి ప్రారంభించి, కారవాన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలకు గొప్ప అనుభూతిని కలిగించే కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక శాఖ శ్రీకారం చుట్టడం సంతోషదాయకమని మంత్రి ఆనం అన్నారు. ఈ కారవాన్‌ను నెల్లూరువాసి అయిన వై.శ్రీనివాసరెడ్డి ఏర్పాటుకు ముందుకు రావడం పట్ల మంత్రి అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా టూరిజం శాఖ ఆధ్వర్యంలో ప్రైవేట్ భాగస్వామ్యంతో ఈ కారవాన్‌లను

-మిగతా 2లో

## కూటమి పాలనలో..
# ప్రజాస్వామ్యం ఖూనీ

**వైసీపీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధనరెడ్డి**



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలో ఉదయగిరి నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వైయస్సార్సీపీ సంస్థాగత నిర్మాణ సభ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి తిరుపతి పార్లమెంట్ సభ్యులు, కమిటీల ఏర్పాటు, టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు

-మిగతా 2లో

## అట్టహాసంగా 77వ గణతంత్ర
# దినోత్సవ సంబరాలు

వివరాలు 3లో



## మంత్రి నారాయణ చొరవ..

# కువైట్ నుంచి నెల్లూరుకు చేరిన షహనాజ్ భౌతికకాయం

- గూడు చేరిన మృతదేహం.. గుండె నిండా కృతజ్ఞత
- రాజకీయ నేత కాదు.. మానవత్వానికి ప్రతిరూపం
- ఒక్క ఫోన్ కాల్‌కే స్పందించిన మంత్రి నారాయణ
- ఎంబసీతో చర్చలు.. సొంత ఖర్చులతో రవాణా
- షహనాజ్ అంతిమ యాత్రకు అండగా మంత్రి నారాయణ





**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** కష్టం వస్తే కాపాడేవాడే నాయకుడు.. కన్నీరు తుడిచేవాడే అసలైన మనిషి. కువైట్‌లో ప్రాణాలు కోల్పోయిన ఓ పేదతల్లి భౌతికకాయాన్ని స్వదేశానికి తీసుకు రావడంలో ఏపీ మంత్రి నారాయణ చూపిన చొరవ ఇప్పుడు అందరినీ కదిలిస్తోంది. తన బిడ్డలను చూడకుండానే కన్నుమూసిన ఆ తల్లికి, కనీసం అంతిమ సంస్కారాలైనా దక్కాలని సొంత ఖర్చులతో ఆమె మృతదేహాన్ని నెల్లూరుకు తెప్పించి మానవత్వం చాటుకున్నారు మంత్రి నారాయణ. విధి ఆడిన వింత నాటకంలో ముగ్గురు ఆడబిడ్డలు అనాథలయ్యారు. పొట్టకూటి కోసం సుదూర తీరాలకు వెళ్ళిన నెల్లూరుకు చెందిన షహనాజ్, కువైట్‌లో అకస్మాత్తుగా మరణించింది. కనీసం ఆ తల్లి ముఖాన్ని కడసారి చూసుకునే స్తోమత కూడా లేని నిరుపేద కుటుంబం అది. మృతదేహం వస్తుందో.. రాదో.. తెలియక, దిక్కు తోచని స్థితిలో ఉన్న ఆ కుటుంబానికి మంత్రి నారాయణ రూపంలో దేవుడు కనిపించాడు. షహనాజ్ మరణవార్త తెలుసుకున్న 54వ డివిజన్ క్లస్టర్ ఇంచార్జి జహీర్ మంత్రి నారాయణకి తెలియజేశారు. చలించిపోయిన మంత్రి నారాయణ వెంటనే స్పందించిన.. రాజకీయ నాయకుడిలా కాకుండా ఒక కుటుంబ సభ్యుడిలా ఆలోచించారు. వెంటనే కువైట్ ఎంబసీ అధికారులతో మాట్లాడి, నిబంధనల చిక్కుముడులను విప్పించారు. విదేశాల నుంచి భౌతికకాయాన్ని తీసుకురావడానికి అయ్యే భారీ ఖర్చును ఏ ప్రభుత్వ నిధుల నుంచో కాకుండా.. తన సొంత ఖర్చుల నుంచి చెల్లించి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. మంత్రి ఏర్పాటు చేసిన అంబులెన్స్ నెల్లూరులోని ఆమె స్వగృహానికి ఆదివారం చేరుకోగానే అక్కడి వాతావరణం గంభీరంగా మారింది. 'అమ్మా.. లే అమ్మా..' అంటూ ముగ్గురు కూతుళ్లు చేసిన ఆర్త నాదాలు అక్కడున్న వారి గుండెలను పిండేశాయి. ఈ కన్నీటి సంద్రంలో మంత్రి నారాయణ చేసిన సాయం ఆ కుటుంబానికి కొండంత అండగా నిలిచింది. ఒక పేద కుటుంబం పడుతున్న ఆవేదనను అర్థం చేసుకుని, క్షణాల్లో స్పందించిన నారాయణ చొరవపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**స్థానిక బంధువుల మాటలు :**

మాకు ఏం చేయాలో పాలుపోలేదు. కానీ మంత్రి దేవుడిలా స్పందించారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా షహనాజ్ మృతదేహాన్ని మా కళ్ల ముందుకు తెచ్చారు. ఆయన ఔదార్యాన్ని మేము జీవితాంతం మర్చిపోలేమన్నారు. రాజకీయం అంటే పదవులు మాత్రమే కాదు.. ప్రజాసేవ అని నిరూపించారు మంత్రి నారాయణ. అధికారం ఉన్నా లేకపోయినా ప్రజల కష్టాల్లో పాలుపంచుకునే ఆయన మనసు నెల్లూరు వాసుల హృదయాలను గెలుచుకుంది. షహనాజ్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ.. ఆ బిడ్డలకు అండగా నిలిచిన మంత్రికి జనం నీరాజనాలు పలుకుతున్నారు.

## కూటమి పాలనలో.. ప్రజాస్వామ్యం ఖూనీ

(మొదటి పేజీ తరువాయి)

డాక్టర్ మద్దెల గురుమూర్తి, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, మాజీ శాసనమండలి సభ్యులు బొమ్మిరెడ్డి రాఘవేంద్ర రెడ్డిలతో కలిసి మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ.. ప్రతి నియోజకవర్గంలో సుమారు 10 వేల మంది గ్రామస్థాయి కమిటీ సభ్యులకు అవకాశం లభిస్తుందన్నారు. గ్రామస్థాయిలో కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు కార్డులు ఇచ్చి, జగనన్న ప్రభుత్వంలో పెద్దపీట వేస్తామన్నారు. మెట్ట ప్రాంత రైతులకు నీళ్లు ఇవ్వాలని రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు జగన్మోహన్ రెడ్డి రూపకల్పన చేసి పనులు ప్రారంభించి, జరుగుతున్న క్రమంలో చంద్రబాబు అర్ధాంతరంగా ఆ పనులు నిలిపివేశారన్నారు. జగన్మోహన్ రెడ్డి అనేక సందర్భాల్లో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ఎందుకు నిలిపివేశారని అడిగితే చంద్రబాబు సమాధానం చెప్పలేదన్నారు. చంద్రబాబు ఉద్దేశపూర్వకంగానే తాను చెప్పిన మీదట రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఆపివేశాడంటూ రేవంత్ రెడ్డి, తెలంగాణ అసెంబ్లీలో మాట్లాడిన తరువాత అందరికి అర్థమైందన్నారు. నెల్లూరు జిల్లా రైతులకు కల్పవృక్షం లాంటి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని రేవంత్ రెడ్డి కోసం చంద్రబాబు నిర్వీర్యం చేశాడన్నారు. ఈ రాష్ట్రం మద్యాంధ్రప్రదేశ్‌గా మారిపోయిందని, నీళ్లు లేని గ్రామాలు ఉంటాయేమో కానీ, బెల్ట్‌షాప్‌లు లేని సందులు లేవన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఇంటి వద్దకే నిత్యవసర సరుకులు అందిస్తే, కూటమి ప్రభుత్వంలో మద్యం డోర్ డెలివరీ చేస్తున్నారన్నారు. రైతులు యూరియా




దొరక్క రోడ్డుపైకి వచ్చి ధర్నాలు చేసే దుస్థితికి ఈ కూటమి ప్రభుత్వం దిగజారిందన్నారు. లోకేష్.. అంబేద్కర్ రాజ్యాంగాన్ని విస్మరించి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలపై ఉపయోగించి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నాడన్నారు. కూటమి ప్రభుత్వంలో అక్రమ కేసులు బనాయిస్తూ, రాజకీయ రాక్షసానందం పొందుతున్నారన్నారు.

వైఎస్ఆర్‌సీపీ నాయకులపై కూటమి ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులకు భయపడకుండా ధైర్యంగా పోరాడటం అభినందనీయమన్నారు. భారతదేశంలో ఏ ముఖ్యమంత్రికి లేని అభిమానం జగన్మోహన్ రెడ్డికే సొంతం అన్నారు. పవిత్రమైన తిరుమల తిరుపతి లడ్డులో జంతువుల కొవ్వు కలిపి కల్తీ చేశారని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నీచపు రాజకీయాలు చేసి ప్రచారం చేశారన్నారు. సిట్ విచారణలో తిరుమల లడ్డులో జంతువుల కొవ్వు కలవలేదని స్పష్టత వచ్చిందని, టీటీడీని కూడా రాజకీయాలకు వాడుకోవడం చంద్రబాబుకే చెల్లిందన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో వైఎస్ఆర్ సీపీ నాయకులను అక్రమ కేసులు పెట్టి పోలీసులు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అధికారం ఎవరికి శాశ్వతం కాదు, కూటమి నాయకుల మాటలు విని పోలీస్‌లు తప్పుడు కేసులు పెట్టి వేధిస్తే.. ఆ ప్రతిఫలం అనుభవించాల్సిందేనన్నారు. అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్న పోలీస్‌లను జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన వెంటనే విచారించి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా.. అందుబాటులో ఉండి పరిష్కరించే మేకపాటి రాజగోపాల్ రెడ్డిని రాబోయే ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించి మంచి మెజారిటీతో గెలిపించాలని కోరారు.

## టెంపుల్ టూరిజం అభివృద్ధికి ప్రత్యేక కృషి



(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించి పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు భక్తులకు వెసులుబాటు కల్పించనున్నట్లు మంత్రి ఆనం స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు టెంపుల్ టూరిజంను అభివృద్ధి చేయాలని, ప్రసిద్ధ పుణ్య క్షేత్రాలను టూరిజం సర్క్యూట్‌లుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టారన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో టెంపుల్ టూరిజాన్ని అభివృద్ధి చేసేందుకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నేతృత్వంలో తాను, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఆరఅండ్‌బి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డితో సీఎం ఒక సబ్ కమిటీని నియమించినట్లు మంత్రి ఆనం చెప్పారు. ఇప్పటికే ఈ కమిటీ ఒకసారి సమావేశమై టూరిజం అభివృద్ధిపై చర్చించినట్లు చెప్పారు. మన రాష్ట్రంలోని పుణ్యక్షేత్రాల సమాచారాన్ని, వసతి సౌకర్యాలను అన్నీ కూడా భక్తులు సులభంగా అర్థమయ్యేలా ఒక వెబ్‌సైట్‌లో టూరిజం సర్క్యూట్‌లను ఏర్పాటు చేసి పర్యాటకరంగ అభివృద్ధికి ప్రభుత్వం దృఢసంకల్పంతో పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి ఉషశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ ద్వారా పేదలకు ప్రాణభిక్ష



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా పేద ప్రజలకు ప్రాణ భిక్ష పెడుతున్నారని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నెల్లూరు రూరల్ పరిధిలో బ్రెయిన్ సమస్యతో బాధపడుతున్న మాముడూరు వేణుకు ప్రభుత్వం మంజూరు చేసిన 5 లక్షల ఎల్‌వోసీని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ దంపతులు బాధితులకు సోమవారం అందజేశారు. మాముడూరు వెంకటస్వామి, రాజేశ్వరి దంపతుల కుమారుడు వేణు 9 ఏళ్ల వయసులో ఫిట్స్ బారిన పడ్డారు. ఎన్ని హాస్పిటల్స్ తిరిగినా.. నయం కాకపోవడంతోపాటు ఆర్థిక భారం పెరిగింది. ప్రస్తుతం నారాయణ ఆసుపత్రిలో చేర్పించగా.. ఆపరేషన్ నిమిత్తం 12 లక్షల అవుతుందని చెప్పారు. విషయం తెలుసుకున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి.. ఆ ఆపరేషన్ నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ కింద రాష్ట్ర ప్రభుత్వం నుంచి 5 లక్షలు మంజూరు చేయించారు. ఈ మేరకు ఆ ఎల్‌వోసీని సోమవారం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కేతంరెడ్డి వినోద్ రెడ్డి, గడ్డం సుజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నేత జాకీర్ లేనిలోటు పూడ్చలేనిది

### ఆ కుటుంబానికి తాము అండగా ఉంటాం : ఎంపీ వేమిరెడ్డి



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** మంచి వ్యక్తిత్వం ఉన్న నాయకులు జాకీర్ మృతి తీవ్రంగా బాధించిందని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఇటీవల రహదారి ప్రమాదంలో మృతి చెందిన జాకీర్ కుటుంబ సభ్యులను సోమవారం రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్‌తో కలిసి నగరంలోని జాకీర్ ఇంటికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. జాకీర్ అందించిన సేవలు, తనతో ఉన్న అనుబంధాన్ని ఎంపీ గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. జాకీర్ పార్టీ బలోపేతానికి ఎంతో కష్టపడి పనిచేశారన్నారు. మైనార్టీ జనరల్ సెక్రటరీగా కూడా పదవి పొందారన్నారు. ఇలాంటి సమయంలో జాకీర్ అకాల మృతి ఆవేదన కలిగించిందన్నారు. జాకీర్ అన్న ఉస్మాన్ షరీఫ్ ఆ కుటుంబానికి అండగా నిలవడం సంతోషకరమని చెప్పారు. ఇలాంటి సమయంలో ఆ కుటుంబానికి తాము అండగా ఉంటామని, ఎప్పుడు ఎలాంటి సహాయం కావాలన్నా తాము చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి మేయర్ రూప్ కుమార్ యాదవ్, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, మదీన వాచ్ ఇంతియాజ్, సయ్యద్ ఇంతియాజ్, ముస్లిం మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### అట్టహాసంగా 77వ గణతంత్ర దినోత్సవ సంబరాలు

# అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు, శకటాల ప్రదర్శన

**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** 77వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. సోమవారం ఉదయం నెల్లూరు నగరంలోని పోలీసు పరేడు మైదానంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో విద్యార్థిని విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. కోవూరు జెడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థినులు దేశభక్తిని పెంపొందించేలా దేశమంటే మట్టికాదోయ్ నృత్య రూపకం అందరినీ ఆకట్టుకుంది. ముత్తుకూరు అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థుల హమారా హిందుస్తానీ నృత్యప్రదర్శన ఆలోచింపజేసింది. తొలిసారిగా ప్రభుత్వ ఉపాధ్యాయులు చేసిన సర్కారుబడి గొప్పతనం తెలిపేలా ప్రదర్శించిన కోలాట ప్రదర్శన ప్రభుత్వ పాఠశాలల ఔన్నత్యాన్ని చాటింది. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎస్పీ అజితా వెజెండ్ల విద్యార్థులను అభినందిస్తూ మెమెంటోలను అందించారు.



### రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించిన వివిధ శాఖల శకటాలు

రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ సాగిన వివిధ ప్రభుత్వ శాఖల శకటాలు అందరినీ ఆకట్టుకున్నాయి. జిల్లా గ్రామీణ అభివృద్ధి శకటం, జిల్లా నీటి యజమాన్య సంస్థ శకటం, నెల్లూరు నగరపాలక సంస్థ శకటం, గృహ నిర్మాణ శాఖ శకటం, వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, వ్యవసాయ అనుబంధ శాఖలు, స్వర్ణకారుల శకటం, జిల్లా పర్యాటక శాఖ, పరిశ్రమలశాఖ, విద్యుత్ శాఖ శకటాలు ఆకట్టుకున్నాయి. ఈసారి ప్రత్యేకంగా నెల్లూరు జిల్లా స్వర్ణకారుల గొప్పతనం, నైపుణ్యం వివరించే స్వర్ణకారుల శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇందులో డిఆర్‌డిఏ శకటానికి మొదటిస్థానం, వ్యవసాయశాఖకు ద్వితీయస్థానం, మున్సిపల్, టూరిజం శాఖలకు తృతీయస్థానం లభించగా, స్వచ్ఛాంధ్ర, స్వర్ణకారుల శకటాలకు కన్సోలేషన్ బహుమతులను కలెక్టర్ చేతుల మీదుగా అందించారు.

### స్టాళ్లను సందర్శించిన కలెక్టర్ :

గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీసు కవాతు మైదానంలో వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటుచేసిన స్టాళ్లను కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎస్పీ డాక్టర్ అజితా వెజెండ్ల, జేసీ మొగిలి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ నందన్, జిల్లాస్థాయి అధికారులు పరిశీలించారు. జిల్లా పంచాయతీశాఖ, ఐసిడిఎస్, వ్యవసాయం, ఉద్యానవనశాఖ, మెప్మా, వైద్యారోగ్యశాఖ, ఐటిడిఎ, మత్స్యశాఖ, సహకార శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరించేలా ఏర్పాటు చేసిన స్టాళ్లు అందరిని ఆకట్టుకున్నాయి. ఆయా శాఖల ఆధ్వ ర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

### ఆస్తులు పంపిణీ చేసిన కలెక్టర్ :

గణతంత్ర దినోత్సవం సందర్భంగా డిఆర్‌డిఏ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి కోసం ఎగ్‌కార్ట్స్‌ను మహిళలకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. 18 మంది లబ్ధిదారులకు రూ.35 వేలు విలువ కలిగిన ఎగ్‌కార్టు, రూ.15 వేలు విలువ గల వంటపాత్రలు మొత్తం రూ.50వేలు విలువ గల యూనిట్‌ను 100 శాతం సబ్సిడీతో స్వయం సహాయక సంఘాల్లో మహిళలకు అందించారు. మొత్తం 9 లక్షల విలువైన ఎగ్‌కార్ట్‌లను అందించారు. ఈ ఎగ్‌కార్ట్స్ ద్వారా గుడ్ల ద్వారా తయారు చేసే ఆహార పదార్థాలతో ప్రజలకు పౌష్టికాహారంగా గుడ్డు వినియోగించడాన్ని ప్రోత్సహించడంతో పాటు మహిళలకు ఉపాధి లభిస్తుందని డిఆర్‌డిఏ పీడీ నాగరాజకుమారి తెలిపారు.

విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో 5 లాప్‌టాప్స్, 20 స్మార్ట్ ఫోన్లను దివ్యాంగులకు కలెక్టర్ పంపిణీ చేశారు. ఒక్కొక్క లాప్‌టాప్ విలువ రూ.42 వేలు కాగా, స్మార్ట్‌ఫోన్ విలువ రూ.20 వేలు అని ఆ శాఖ ఏడి మహ్మద్ అయూబ్ తెలిపారు. అలాగే ఐటిడిఎ ఆధ్వర్యంలో 11 మంది మత్స్యకారులకు సైకిల్, వలతో కూడిన యూనిట్లను పంపిణీ చేశారు. ఒక్కొక్క యూనిట్ విలువ రూ.10 వేలు కాగా సబ్సిడీతో వీటిని అందిస్తున్నట్లు ఐటిడిఎ అధికారులు తెలిపారు.

## నేడు జిల్లాలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటన



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ రంగంలో మౌలిక వసతులను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో, గౌరవ ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఇందుకూరుపేట మండలం కుడితిపాలెం గ్రామంలో రూ.3.61 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను మంత్రి ప్రారంభిం చనున్నారు. అలాగే బుచ్చిరెడ్డిపాళెం మండలం పంచేడు గ్రామంలో రూ.3.37 కోట్ల వ్యయంతో నిర్మించిన మరో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను కూడా అదేరోజున ప్రారంభించనున్నారు. కుడితిపాలెం సబ్‌స్టేషన్ ప్రారం భంతో కుడితిపాలెం, రాముడుపాళెం, ముదివర్తిపాళెం, కాలువ మూలకంద్రిక, కొమరిక గ్రామాలకు నిరంతరాయమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుబాటులోకి రానుంది. ఈ సబ్‌స్టేషన్ పరిధిలో మొత్తం 947 విద్యుత్ కనెక్షన్లు ఉండగా, ముఖ్యంగా ఈ ప్రాంతంలోని ఆక్వా రైతులకు మెరుగైన నాణ్యత గల విద్యుత్ సరఫరా అందనుంది. అదే విధంగా, పంచేడు సబ్‌స్టేషన్ ద్వారా పంచేడు, జెండాదిబ్బా, ఇసకపాలెం, సాల్మన్‌పురం గ్రామాలకు నిరంతరాయ విద్యుత్ సరఫరా కల్పించబడుతుంది. ఈ సబ్‌స్టేషన్ పరిధిలో మొత్తం 5,398 విద్యుత్ కనెక్షన్లు ఉండగా, గృహ, వ్యవసాయ, వాణిజ్య వినియోగదారులకు విశ్వసనీయమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందనుంది. ఈ రెండు సబ్‌స్టేషన్ల ప్రారం భంతో కోవూరు నియోజకవర్గంలో దాదాపు లక్ష మంది ప్రజలకు ప్రత్యక్ష లబ్ధి చేకూరనుండగా, లో-వోల్టేజ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిం చనుంది. అదేవిధంగా, కోవూరు నియోజకవర్గ పరిధిలో విద్యుత్ శాఖ డివిజనల్ కార్యాలయ నిర్మాణానికి ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యాలయం ద్వారా ప్రజలకు మరింత వేగవంతమైన, సమర్థవంతమైన సేవలు అందించేందుకు అవకాశం కలగనుంది. కార్యక్రమంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొననున్నారు.

# కలెక్టర్ బంగ్లాలో ఆహ్లాదకరంగా ఎట్ హోమ్

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** కలెక్టర్ బంగ్లాలో ఆహ్లాదకరంగా ఎట్ హోమ్ నిర్వహించారు. సాయం సంధ్యవేళ సంగీత విభావరి మనసుకు హాయి గొలిపింది. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులను కలెక్టర్ హిమాన్షు శుక్ల సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమానికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, బల్లి కళ్యాణ్ చక్రవర్తి, ఎమ్మెల్యేలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, కాకర్ల సురేష్, కురుగొండ్ల రామకృష్ణ, దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి, జడ్ శివప్రసాద్, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. అదేవిధంగా ఎస్పీ డాక్టర్ అజితా వెజండ్ల, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, ఏఎస్పి సౌజన్య, డీఎస్పీ దీక్ష, డిఆర్వో విజయ్ కుమార్, ఆర్డీవోలు, జిల్లా స్థాయి అధికారులు కూడా పాల్గొన్నారు. అధికారులు, వారి కుటుంబ సభ్యులను కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆప్యాయంగా పలకరించి ఫోటోలు దిగారు.







# ప్రగతి పథంలో నెల్లూరు జిల్లా

(మొదటి పేజీ తరువాయి)

శిక్షణ అందించడం జరిగింది. అలాగే ఆత్మ పథకం ద్వారా ఛాంపియన్ రైతుల పొలాలలో 600 ప్రదర్శన క్షేత్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 'అన్నదాతా సుఖీభవ', 'పీఎం కిసాన్' పథకాల ద్వారా అర్హులైన 3,64,216 మంది రైతు కుటుంబాలకు పెట్టుబడి రాయితీగా రూ.261.80 కోట్ల రూపాయలను ప్రభుత్వం నేరుగా రైతుల ఖాతాలలో జమచేయడం జరిగిందన్నారు. కౌలు రైతులకు రాయితీలు, పంట రుణాలు అందించేందుకు జిల్లాలో 22,503 కౌలు కార్డులు మంజూరు చేసి, వీరిలో 2,521 మంది రైతులకు బ్యాంకుల ద్వారా రూ.14.74 కోట్ల పంట రుణాలను అందించడం జరిగిందన్నారు. జిల్లాలోని 24 మండలాలకు చెందిన రైతులు 38 గ్రూపులుగా ఏర్పడి, 80 శాతం సబ్సిడీతో 38 కిసాన్ డ్రోన్లను పొందారు. ఒక్కో డ్రోన్ ధర రూ.9.80 లక్షలు కాగా, రూ.7.84 లక్షల సబ్సిడీ అందించి, కేవలం రూ.2 లక్షలకే డ్రోన్లు అందించడం జరిగిందన్నారు. అలాగే వివిధ శాఖల అభివృద్ధిని ఆయన సమగ్రంగా వివరించారు







# విద్యుత్ అధికారులకు గణతంత్ర పురస్కారాలు








**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** ఏపీ ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ నెల్లూరు సర్కిల్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న పలువురు అధికారుల సేవలను గుర్తించి 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా కలెక్టర్ చేతులు మీదుగా ప్రధానం చేసిన బెస్ట్ ఆఫీసర్స్ పురస్కారాలతో అరుదైన గౌరవమర్యాదలు వరించాయి. ఈమేరకు కలెక్టర్ చేతుల మీదుగా జిల్లా పర్యవేక్షక ఇంజనీరు కే.రాఘవేంద్రంతోపాటు కావలి విద్యుత్ ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కేఎస్ బెనర్జీ, నెల్లూరు రూరల్స్ సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు యు.ప్రభాకరరావు, డైకస్ రోడ్డు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీరు ఎస్.లక్ష్మీబాయి, అకౌంట్ ఆఫీసర్ మహేష్, పిసి రామ్మోహన్‌లకు ఉత్తమ ఆఫీసర్లుగా అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా బెస్ట్ ఇంజనీర్ అవార్డు గ్రహీత, సూపరింటెండింగ్ ఇంజనీర్ కె.రాఘవేంద్రం మాట్లాడుతూ.. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ఉత్తమ ఇంజనీరింగ్ అధికారిగా అవార్డును అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ అవార్డు తన భాధ్యతను మరింత పెంచిందన్నారు. విద్యుత్ శాఖ అధికారుల సేవకు ప్రత్యేక. గుర్తింపుతో గన తంత్ర అవార్డు రావడం. వెనుక జిల్లాలోని అందరు అధికారులు, సిబ్బంది సమిష్టి కృషితో టీం వర్క్ చేయడమే ప్రత్యక్షంగానూ, పరోక్షంగాను కారణమైనట్లు తెలిపారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ఆఫీస్ అవార్డు అందుకున్న కావలి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కే ఎస్ బెనర్జీ, నెల్లూరు రూరల్స్ సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యు.ప్రభాకరరావు, అసిస్టెంట్ ఇంజనీరు సింగిరి లక్ష్మీబాయి తోపాటు అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ మహేష్, ఏపీటిఎస్ విజిలెన్స్ కానిస్టేబుల్ రామ్మోహన్‌లకు పేరుపేరునా శుభాకాంక్షలు తెలిపారు.

# గణతంత్ర వేడుకల్లో విద్యుత్ శాఖ శకటం ఏర్పాటు

- పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో మొట్టమొదటిసారిగా విద్యుత్ శకటం
- పీఎం కుసుమ్, పీఎం సూర్య ఘర్, ఆర్డీఎస్ఎస్, కరెంటోళ్ళ జనబాట.. డయల్ యువర్ సిఎండిపై అంతర్లీనంగా సందేశాలతో అవగాహన
- విద్యుత్ వినియోగదారులు, అధికారులు, సిబ్బంది తోపాటు రైతులకు గణతంత్ర శుభాకాంక్షలు
- కలెక్టర్, కార్పొరేట్, విద్యుత్ భవన్‌లలో అవార్డ్స్ అందుకున్న గ్రహీతలకు శుభాకాంక్షలు

**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** 77వ గణతంత్ర దినోత్సవం రిపబ్లిక్ డే సందర్భంగా స్థానిక దర్గా మిట్ట ప్రాంతంలో ఉన్న పోలీస్ పరేడ్ గ్రౌండ్ నందు ఏర్పాటుచేసిన విద్యుత్ శాఖ శకటం ప్రత్యేక ఆకర్షణతో అందరినీ వీక్షింపజేసింది. జిల్లా కేంద్రంలోని పోలీసు మైదానంలో మొట్ట మొదటిసారిగా ఏర్పాటు చేసిన ఏపీ దక్షిణ ప్రాంత పంపిణి సంస్థ శకటంలో పిఎం కుసుమ్, పీఎం సూర్యఘర్, ఆర్‌డిఎస్ఎస్, కరెంటోళ్ల జనబాట, డయల్ యువర్ విద్యుత్ సీఎండి తదితర కార్యక్రమాల. యొక్క ఆవశ్యకతపై ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ, నెల్లూరు జిల్లా పరిధిలో ఉన్న ప్రజలు, వినియోగదారులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు అవసర మైన అంశాలను అంతర్లీ నంగా పొందుపరచడం జరిగిందన్నారు. ఎందరో మహానుభావుల కృషి, కష్ట, ప్రాణ త్యాగాల ఫలితంగా లభించిన ఈ గణతంత్ర దినోత్సవం రోజు మనం ఇంత స్వేచ్ఛాయుతంగా ఉన్నామంటే దానికి కారణం మన రాజ్యాంగ వ్యవస్థ అని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ ఇవ్వడమే లక్ష్యంగా ప్రతి అధికారి, సిబ్బంది పరస్పర సమన్వయంతో పని చేయాల్సి ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకనుగుణంగా మనమందరం విజన్-2047 వైపు అడుగులెయ్యాలని, సోలార్ వినియోగంపై



ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, పునరుత్పాదక ఇంధన శక్తి గురించి వినియోగదారులకు పూర్తిస్థాయిలో అర్థమ య్యేలా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది తెలియజేయాలని ఈ సందర్భంగా ఉన్నతాధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శేషాద్రి బాల చంద్ర, నెల్లూరు రూరల్, కావలి ఆపరేషన్ డివిజన్ లతోపాటు కన్ స్ట్రక్షన్ డివిజన్ కు చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు లక్ష్మి నారాయణ, బెనర్జీ, పరందామయ్య, అకౌంట్స్ ఆఫీసర్ విజిత, డిప్యూటీ ఇంజనీర్స్, అసిస్టెంట్స్ అకౌంట్స్ ఆఫీసర్స్, అసిస్టెంట్ ఇంజనీర్స్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఠాగూర్ పాఠశాలలో గణతంత్ర దినోత్సవం



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేటలోని ఠాగూర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో 77వ రిపబ్లిక్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఠాగూర్ పాఠశాల కరస్పాండెంట్ సిహెచ్ వెంకటరమణారెడ్డి ప్రధానోపాధ్యాయులు కె.దొరస్వామి రెడ్డిల ఆధ్వర్యంలో గత వారం రోజుల నుంచి అన్ని తరగతుల విద్యార్థిని విద్యార్థులకు స్పోర్ట్స్ మీట్ నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు జెండా వందనం అనంతరం ఏఎస్పేట ఎస్సై ఏ సైదులు చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేయడం జరిగింది. అన్ని తరగతులకు కలిపి మొత్తం 350 మెడల్స్‌ను గెలుపొందిన విద్యార్థులకు ఇవ్వడం జరిగింది. గేమ్స్‌తోపాటు డ్రాయింగ్, స్పెల్ బి, టేబుల్ కాంపిటేషన్, క్విజ్ కాంటెస్ట్, హ్యాండ్ రైటింగ్ వంటి అనేకమైన స్కిల్ గేమ్స్ కూడా నిర్వహించి విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా గణతంత్ర వేడుకలు గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సిహెచ్ వి.రమణారెడ్డి, డైరెక్టర్ కే.దొరస్వామిరెడ్డి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు అందరూ పాల్గొన్నారు.

## గణతంత్ర దినోత్సవ వేడుకలు



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా జనసేన పార్టీ గోమతి నగర్ కార్యాలయంలో సోమవారం 77వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ సీనియర్ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా ఎగురవేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, గునుకుల కిషోర్ మాట్లాడుతూ.. 1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమల్లోకి రావడం ద్వారా ప్రజలే పాలకులు అనే గణతంత్ర భావనకు బీజం పడిందని, ఈ చారిత్రక దినం భారత ప్రజాస్వామ్యానికి పునాది అని తెలిపారు. జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఎప్పుడూ నొక్కి చెబుతున్నట్లుగా రాజ్యాంగ విలువలైన న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం ప్రతి పౌరుడి జీవన విధానంగా మారాలని పిలుపునిచ్చారు. డా. బి.ఆర్. అంబేద్కర్ నాయకత్వంలో రూపుదిద్దుకున్న భారత రాజ్యాంగం ప్రపంచానికి మార్గదర్శకమైన గొప్ప రాజ్యాంగమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని గణతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.

## ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓలకు ఉత్తమ అవార్డులు




**వింజమూరు, మేజర్‌న్యూస్ :** గణతంత్ర దినోత్సవ సందర్భంగా వింజమూరు మండల పరిషత్ అధ్యక్షులు కే శ్రీనివాస్ రెడ్డి అదేవిధంగా డిప్యూటీ ఎంపీడీవో కే.రామారావులో ఉత్తమ అవార్డులను అందుకున్నారు. కార్యక్రమ సందర్భంగా జిల్లాలోని పాలనాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ హిమన్స్ శుక్ల చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. మండలంలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడం గ్రామీణ ప్రాంతాలు పరిశుభ్రతను కాపాడడం తదితర అంశాలపై చిత్తశుద్ధిగా కృషి చేయడం వల్ల వారి కృషిని గుర్తించిన ప్రభుత్వం ఈ అవార్డును ఎంపిక చేసింది ఈ సందర్భంగా వారిని పలువురు ఉద్యోగులుకార్యాలయ సిబ్బంది తదితరులు అభినందించారు.

## పశు సంవర్ధక శాఖ ఏడీకి ఉత్తమ సేవా పురస్కారం



**మనుబోలు, మేజర్‌న్యూస్ :** మనుబోలు పసు సవర్ధక శాఖ ఏడి పి.గురువారెడ్డికి రిపబ్లిక్ డే సందర్భంగా అవార్డు లభించింది. నెల్లూరు పోలీస్ ప్యారేట్ గ్రౌండ్లో జిల్లా కలెక్టర్ విమాన శుక్ల చేతుల మీదుగా సోమవారం ఏడీ గురువారెడ్డికి ఉత్తమ సేవా పథకం అందజేశారు. ఏడి గురువారెడ్డి రెండోసారి ఈ ఉత్తమ పురస్కారం అందుకోవడం విశేషం. మనుబోలు మండలంలో అన్ని పశువుల హాస్పిటల్ గురువారెడ్డి చేస్తున్న సేవలకు ఈ అవార్డు దక్కింది. మనుబోలు పశువర్ధక శాఖ ఉపసంచాలకులుగా గురవారెడ్డి కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకోవడంతో మునుబోలు మండల ప్రజలు రైతులు ఆయన స్నేహితులు బంధువులు గురువారెడ్డి వచ్చిన అవార్డు పట్ల సంతోషం వ్యక్తం చేసి శుభాకాంక్షలు చెప్పారు. తనకు ఈ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని గురువారెడ్డి మీడియాతో తెలిపారు. అవార్డుతో తన పైన మరింత బాధ్యతలు పెరిగాయని పేర్కొన్నారు. అవార్డులు ఉత్తమ సేవా పురస్కారాలు కష్టపడితే రావని ఇష్టపడి పని చేస్తే వస్తాయని తెలిపారు. అలాగే, గురివింద పూడి వెటర్నటి అసిస్టెంట్ సుధాకర్ కూడా ఉత్తమ సేవా పురస్కారం లభించింది.

## ప్రతిభకు అవార్డు ప్రధానం



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి డివిజన్ ఎఫ్ఎంటిగా విధులు నిర్వహిస్తున్న కె.రామ్మోహన్‌కి జిల్లాస్థాయి ఉత్తమ ఎఫ్ఎంటి అవార్డు ప్రధానం చేశారు. ఉదయగిరి డివిజన్ పరిధిలోని ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, వరికుంటపాడు, మండలాలలో ప్రకృతి వ్యవసాయం పట్ల రైతులతో ప్రజలతో మమేకమై మంచి ఫలితాలు సాధించినందుకు ఆయనకు ఈ గౌరవం దక్కింది. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ.. ఈ అవార్డుకు తనను ఎంపిక చేసినందుకు జిల్లా స్థాయి అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. రారున్న రోజుల్లో డివిజన్ పరిధిలోని అధికారులను కలుపుకొని రైతులు ప్రజలతో మమేకమై ముందుకు పోతానని తెలిపారు.

## ఘనంగా గణతంత్ర దినోత్సవం



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి జి.హరికృష్ణకి బెస్ట్ సర్వీస్ అవార్డు లభించింది. ఈ సందర్భంగా జిల్లా సైనిక సంక్షేమ అధికారి జి.హరికృష్ణని మాజీ సైనికులు అందరూ అభినందించారు. వారు మాజీ సైనికులకు చేస్తున్న సేవలను కొనియాడి కృతజ్ఞతలు తెలియజేశారు. కృతజ్ఞతలు తెలియజేసిన వారిలో అఖిలభారత పూర్వ సైనిక సేవ పరిషత్ అధ్యక్షులు వెంకట్, ఉపాధ్యక్షులు పీపల రాము, మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు కళాధర్, ఉపాధ్యక్షులు రత్నయ్య, మాజీ సైనికులు పాల్గొన్నారు.

## రవాణా కార్యాలయంలో గణతంత్ర వేడుకలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు రవాణా శాఖా కార్యాలయంలో సోమవారం భారత్ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎం.రాములు జాతీయ జెండాను ఎగురవేసి స్వాతంత్ర్య ఉద్యమం, గణతంత్ర దినోత్సవ ప్రాధాన్యత గురించి ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం సిబ్బని, విద్యార్థులు, వాహనకారులు తదితరులు పాల్గొన్నారు.

# నారాయణలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నారాయణ వైద్య విద్యా సంస్థల ప్రాంగణంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. అట్టహాసంగా జరిగిన ఈ వేడుకల్లో నారాయణ మెడికల్ కాలేజ్, హాస్పిటల్ డీన్ డాక్టర్ పి.శ్రీనివాసులురెడ్డి ముఖ్యఅతిథిలుగా హాజరయ్యారు. ఆధ్యాపకులు, విద్యార్థులు సాదర స్వాగతం పలికారు. వైద్య విద్యా సంస్థల సెక్యూరిటీ సిబ్బందిచే గౌరవ వందనం స్వీకరించిన అనంతరం, డాక్టర్ పి.శ్రీనివాసులు రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, జెండా వందనం చేసి, జాతీయ గీతం ఆలపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం అందించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని, రాజ్యాంగబద్ధ పాలనకు తమవంతు తోడ్పాటు అందిచాలని కోరారు. ఈ సందర్భంగా దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. దేశభక్తితో ముందుకెళ్లాలని, భావిభారత పౌరులుగా ఎదగాలన్నారు. విద్యార్థులకు, సిబ్బందికి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలలో దేశభక్తి గీతాలాపన, సాంస్కృతిక నృత్య ప్రదర్శన చేసిన వారిని జ్ఞాపికతో సత్కరించారు. సామాజిక కార్యక్రమాలలో సేవలందిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ డి.ఎం కార్తీక్, ఇతర సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వైద్య విద్యాసంస్థల ఆపరేషన్స్ హెడ్ డి.రామారావు, నారాయణ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విశ్వకుమార్, మెడికల్ సూపరింటెండెంట్ డా ప్రభావతి, అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.హరీష్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ్ కాంత్ దంతవైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అజయ్ రెజినాల్డ్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనజకుమారి, ఫార్మసి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్రీనివాసులు, ఏజీఎం ఎసి శేఖర్ రెడ్డి, వైద్యులు, వైద్య విద్యార్థులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కిమ్స్ హాస్పిటల్ నందు గణతంత్ర దినోత్సవ వేడుకలు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు కిమ్స్ హాస్పిటల్ నందు జనవరి 26, 2026 భారతదేశ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సీఎస్ శ్రీనివాస రాజు జాతీయ జెండాను ఆవిష్కరించి, రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తి, దేశ ఐక్యతపై ప్రసంగాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన వైద్యులు, సిబ్బంది దేశ అభివృద్ధిలో ఆరోగ్య సేవల పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించే రాజ్యాంగాన్ని గౌరవిస్తూ, వృత్తిపరమైన నిబద్ధతతో ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. ఈ వేడుకల్లో డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, ఆఫీస్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది, హౌస్ కీపింగ్ సిబ్బంది పాల్గొని గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశ ఐక్యత, కర్తవ్య భావన మరింత బలపడాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సపోర్టుతో పనిచేసే కళ్లద్దాల ఉచితంగా అందచేశారు. కిమ్స్ ఫౌండేషన్ వారు ఈ గణతంత్ర దినోత్సవం సందర్భంగా పూర్తిగా కళ్ళు కోల్పోయిన 20మందికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సపోర్టుతో పనిచేసేటువంటి కళ్లద్దాలను సుమారు 38వేల రూపాయలు విలువచేసే ఈ పరికరాలను వివిధ ప్రదేశాల నుంచి వచ్చినటువంటి అంధులకు ఉచితంగా ఇచ్చారు.చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సిఎస్ శ్రీనివాస రాజు, యూనిట్ హెడ్ అండ్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ రోహిణి ప్రియ లక్ష్మి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.సతీష్ కుమార్, తదితర డాక్టర్లు, మెడికల్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీధర్ రెడ్డి పాల్గొని గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# సోమశిలలో గణతంత్ర దినోత్సవం




**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** సోమశిల గ్రామపంచాయతీలో ఈరోజు గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా అనంతసాగరం మండల టీడీపీ ఉపాధ్యక్షులు, మాజీ సర్పంచ్ ఉప్పల విజయకుమార్, గ్రామ సర్పంచ్ చెలంశెట్టి పెంచలయ్య పాల్గొన్నారు. మొదటగా జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. జనగణమన, వందేమాతర గీతాల్ని ఆలపించారు. తరువాత ఉప్పల విజయకుమార్ మాట్లాడుతూ.. ఈరోజు మనం 77వ గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్నాము. ప్రతి సంవత్సరం జనవరి 26న భారత గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకోవడానికి ప్రధాన కారణం ఏమిటంటే 1947 ఆగస్టు 15న మన భారత దేశానికి స్వాతంత్రం వచ్చినప్పటికీ మన దేశానికి సొంత రాజ్యాంగం లేదు. భారత రాజ్యాంగాన్ని రూపొందించడానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అధ్యక్షతన ముసాయిదా కమిటీని ఏర్పాటు చేశారు. భారత రాజ్యాంగాన్ని రూపొందించడానికి రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజులు సమయం పట్టింది. అప్పుడు జనవరి 26 1950న భారత రాజ్యాంగం దేశం మొత్తం అమల్లోకి వచ్చింది. ఇది మనకు చాలా గర్వకారణం. అందుకే ప్రతి సంవత్సరం జనవరి 26న గణతంత్ర దినోత్సవం జరుపుకుంటున్నాము. మన రాజ్యాంగం ప్రపంచంలోకెల్లా అతిపెద్ద లిఖిత రాజ్యాంగం. ఈ రాజ్యాంగం వల్లనే మనకు స్వేచ్ఛగా జీవించడానికి ఈ హక్కులు లభించాయి. ఇంకా మనం ఇంత స్వేచ్ఛగా ధైర్యంగా బ్రతకడానికి మన దేశ సైనికులు, మన దేశ స్వాతంత్ర పోరాట వీరులు ముఖ్య కారణం అయినప్పటికీ నేటికీ మన దేశంలో పేదరికం, అవినీతి, నిరుద్యోగులు, మహిళా భద్రత వంటి ఎన్నో సమస్యలు పెరిగిపోతున్నాయి. వీటిని అధిగమించడానికి మనందరం ఐకమత్యంతో కలిసి పోరాడాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సోమశిల ఎస్సీ సెల్ అధ్యక్షులు ఉదయగిరి శ్రీకాంత్, కొండ్రెడ్డి రామిరెడ్డి, మల్లారెడ్డి, అబ్దుల్ రెహమాన్, కత్తి బాబు, సచివాలయం సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఐ.సాయిప్రసాద్‌కు ఉత్తమ ప్రశంసాపత్రం



**కావలి, మేజర్‌న్యూస్ :** 77వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా న్యాయవాది, సామాజిక సేవలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ పేదలకు ఉచిత న్యాయాన్ని అందిస్తూ న్యాయ సంబంధమైన అంశాలను పేదవారికి తెలియజేస్తూ, వివిధ సామాజిక కార్యక్రమాలు చేయుట గుర్తించిన, నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాను శుక్ల సాయి ప్రసాద్ కు ప్రశంస పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదిని ప్రశంసించారు. కలెక్టర్‌కు సాయిప్రసాద్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యాశాఖ అధికారి మధుసూదన్‌కు పురస్కారం



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ముత్తుకూరు మండలం విద్యాశాఖ అధికారి మధుసూదన్‌కు రిపబ్లిక్ డే సందర్భంగా నెల్లూరు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచినందుకు ఎంఈఓ మధుసూదన్‌కు ఉత్తమ పురస్కారం అందిందని మండల కోఆర్డినేటర్లు సీఆర్పీలు శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని బ్రహ్మదేవి గ్రామ పరిధిలో కెఆర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరెస్పాండెంట్ పురిని ఏడుకొండలు ఎంఈఓ మధుసూదన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలకు రండి



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** గుంటూరు కేంద్రంగా జనవరి 30వ తేదీ నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు జరగనున్న అఖిల భారత కిసాన్ సభ జాతీయ కౌన్సిల్ సమావేశాలకు రైతులు రావాలని జిల్లా రైతు సంఘం కార్యదర్శి మూలి వెంగయ్య పిలుపునిచ్చారు. సోమవారం ఆయన ముత్తుకూరుకు విచ్చేసి శ్రామిక రైతు సంఘం మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించి కరపత్రాన్ని విడుదల చేశారు. రైతులు పెద్ద ఎత్తున హక్కులపై పోరాటాలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు నక్క రాధయ్య, మండల రైతు సంఘం నాయకులు మల్లి కొండయ్య, మహేశ్వర్ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ చట్టాలు కార్మికులకు యమపాశాలు




**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన కార్మిక చట్టాలు కార్మికుల కుటుంబాల పాలిట యమపాశాలుగా ఉన్నాయని జిల్లా సిఐటియు జనరల్ సెక్రటరీ గోగుల శ్రీనివాసులు విమర్శించారు. సోమవారం ఆయన ముత్తుకూరులోని శ్రామిక భవనం నందు విలేకరులతో మాట్లాడారు. లేబర్ కోడ్స్ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేక చట్టాలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వచ్చిన అలా 12వ తేదీన జరిగే దేశవ్యాప్త కార్మిక సమ్మెలో అన్ని విభాగాల కార్మికుల పాల్గొని విజయవంతం చేసి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని ఆయన సూచించారు. తదుపరి సమ్మె కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు అంకయ్య, మస్తాన్ షా, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యా సామాగ్రి, బహుమతులు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** పంటపాలెం గ్రామపంచాయతీ తెలుగుదేశం పార్టీ బీసీ నాయకులు తిన్నెలపూడి సిద్దు దాతృత్వంతో స్థానిక పాఠశాల విద్యార్థులు విద్యాసామాగ్రిని తీసుకున్నారు. సోమవారం గ్రామంలోని మండల ప్రజా పరిషత్ పూర్వోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేశారు. అనంతరం దాత తిన్నెలపూడి మాట్లాడారు. పేద విద్యార్థులకు సాయం చేయడం తమ అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పిల్లలు కష్టపడి చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆలపాక శ్రీనివాసులు, అధికార పార్టీ నాయకులు పల్లం రెడ్డి శ్రీధర్ రెడ్డి, శ్యామ్ రెడ్డి, వడ్లమూడి రమణయ్య నాయుడు, షేక్ మైనుద్దీన్, పాకం అనీల్, నాగేంద్ర, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ లీడర్షిప్ అవార్డులు అందజేత



**కావలి, మేజర్‌న్యూస్ :** గణతంత్ర దినోత్సవం సందర్భంగా కావలి ఎమ్మెల్యే కావ్య ఆదేశాల మేరకు సోమవారం కావలి పురపాల సంఘ కార్యాలయం నందు మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో వారి చేతుల మీదుగా స్వచ్ఛ సర్వేక్షన్ 2026 స్వచ్ఛ లీడర్షిప్ అవార్డులను కావలి పట్టణంలోని వివిధ పాఠశాలలు, కళాశాలలు, వివిధ సంస్థల సంబంధించిన, స్వచ్ఛంద సేవా సంస్థలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, పీహెచ్‌సీ వర్కర్లు అవార్డు గ్రహీతలు పాల్గొన్నారు.

# శ్రీ నేతాజీ వికాస్ పాఠశాలలో గణతంత్ర వేడుకలు

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోని శ్రీ నేతాజీ వికాస్ ఉన్నత పాఠశాల నందు 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హాజరయ్యారు. పాఠశాల కరస్పాండెంట్ కె.వి రత్నం ఆధ్వర్యంలో ముందుగా జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని జరిపించారు జెండా వందనం సమర్పించారు ప్రార్థన కార్యక్రమానంతరం ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. గణతంత్ర దినోత్సవం అంటే మన భారతదేశం సర్వసత్తాక దేశంగా గర్వంగా చెప్పుకునే రోజుగా చెప్పవచ్చన్నారు భారతదేశాన్ని బ్రిటిష్ వారునూరు సంవత్సరాలకు పైగా పరిపాలించే భారతీయులను అత్యంత దారుణంగా హింసిస్తూ బానిసలుగా చూశారని ఇలాంటి అకృత్య కార్యక్రమాలను భారతీయులు సహించలేక ఉద్యమ బాట పట్టారు అనేక పోరాటాలు జరిపి అనేకమార్లు మన భరతమాత ముద్దుబిడ్డలో జైలుకు వెళ్లి తీవ్రమైన హింసను అనుభవించి చివరికి ఎంతోమంది బలిదానం చేసి మన దేశానికి స్వాతంత్ర్యం సంపాదించి పెట్టారన్నారు. ఈ స్వాతంత్ర్యాన్ని స్వేచ్ఛగా అనుభవించేందుకు మనకై మనమే పరిపాలించుకునే విధంగా మన మేధావులు రాజ్యాంగాన్ని



రూపొందించారన్నారు. ఆ రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజునే గణతంత్ర దినోత్సవంగా ప్రతి జనవరి 26వ తేదీన జరుపుకుంటున్నామని తెలిపారు. విద్యార్థిని విద్యార్థులు ఇప్పుడున్న పరిస్థితులకు అనుగుణంగా దేశం నందు భక్తి కలిగి క్రమశిక్షణాయుతమైన ప్రవర్తన అలవర్చుకొని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దబడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థినీ విద్యార్థులు ఉన్నారు.

# సైదాపురంలో 77వ గణతంత్ర దినోత్సవం వేడుకలు



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, మండల కేంద్రంలోని తాహసిల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయంలో ముందుగా మన జాతీయ జెండాను ఎగరవేసి గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. అలాగే మండలంలో మండల అధికారులు గణతంత్ర దినోత్సవం గురించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ సుభద్ర, ఎంపీడీవో ఎం.వి మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. భారత దేశంలో గణతంత్ర దినోత్సవాన్ని భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజుగా జరుపుకుంటారు. ప్రతి సంవత్సరం జనవరి 26 ను భారత గణతంత్ర దినోత్సవంగా జరుపుతారు 1950 జనవరి 26న భారత ప్రభుత్వ చట్టానికి 1935 బదులు భారత రాజ్యాంగం దేశ పరిపాలనకు మార్చడాన్ని భారత గణతంత్ర దినోత్సవం అంటారు. భారత రాజ్యాంగ సభలో 1949 నవంబర్ 26న రాజ్యాంగం ఆమోదం పొందగా భారతదేశం స్వాతంత్రంగా ఆవిర్భవం చేందుకు 1950 జనవరి 26లో దీనిని ఒక ప్రజాతంత్ర పరిపాలన పద్ధతితో పాటుగా అమలులోకి తీసుకురావాలని నిర్ణయించారు. దీనికోసం ఎందరో వీరులు పోరాడారు. తహసిల్దార్ సుభద్ర తెలిపారు. ఢిల్లీలో సైనిక పరేడ్‌లు జరుగుతాయి. ఈ రోజు దేశం స్వాతంత్ర ప్రాతిపత్తి పొందింది. అని తాహసిల్దార్ సుభద్ర సహచర ఉద్యోగులకు, ప్రజలకు స్పష్టంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది, రెవెన్యూ కార్యాలయం సిబ్బంది పోలీస్ సిబ్బంది ఇతరులు పాల్గొన్నారు.

# వాడవాడలా ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** మండలంలో వాడవాడలా గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి పంచాయతీ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవో కే.రామారావు పోలీస్ స్టేషన్లో ఎస్సై వీర ప్రతాప్ అగ్నిమాప కేంద్రంలో అగ్నిమాపక కేంద్రాధికారి వినయ్ తాసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తాసిల్దార్ ఓబయ్య ఐసిడిఎస్ కార్యాలయంలో పద్మజలు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు జండా వందన సమర్పించి గణతంత్ర దినోత్సవం గురించి తన ప్రసంగాన్ని కొనసాగించారు గణతంత్రం ఎందుకు జరుపుకోవాలి కనకంతరం ప్రాముఖ్యత ఏమిటి భారత రాజ్యాంగం యొక్క ఆవశ్యకత ఏమిటి అని అంశాలను వివరించారు కార్యక్రమంలో ఎంపీపీ వనిపెంట హైమావతి సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లుయాదవ్ మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ గూడా నర్సారెడ్డి సొసైటీ సీనియర్ నాయకులు వనిపెంట



వెంకటసుబ్బారెడ్డి పట్టణ అధ్యక్షుడు గురజాల గోపి డైరెక్టర్ కోదూరు నాగిరెడ్డి మండల ప్రధాన కార్యదర్శి చల్లా శ్రీనివాస యాదవ్, మండల కోఆప్షన్ నెంబర్ రఫీ, కర్ణం శ్రీనివాసులు నాయుడు, కుంకు కొండవ నాయుడు ఎంఈఓ మధుసూదన్‌రెడ్డి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు కార్యాలయాల సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్డిఓ కార్యాలయంలో గణతంత్ర వేడుకలు

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి ఆర్డిఓ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి హాజరయ్యారు. వివిధ శాఖల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన ఉద్యోగులకు ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో కార్యాలయంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ పథకాల పురోగతిని వివరించారు. ఇటీవల తుఫాను విపరీత వర్షాల సమయంలో అధికారులు చూపిన చొరవ వలన కావలికి మంచి గుర్తింపు వచ్చిందని ఎమ్మెల్యే తెలిపారు. గణతంత్రం అనేది కేవలం వేడుక మాత్రమే కాదని మనల్ని మనం సంస్కరించుకోవడం దేశాన్ని ప్రేమించడం మాతృభూమిని ఆరాధించడం అని తెలిపారు. ఎందరో మహానుభావులు వారి త్యాగ ఫలితము ఈరోజు స్వాతంత్రం వచ్చిందని వారు తెలిపారు. ప్రతి పౌరుడు మూడు అంశాలు జీవితంలో పాటించాలని సూచించారు. భారత రాజ్యాంగ రూపకల్పంలో కీలకపాత్ర వహించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తో పాటు ఇతర మహానుభావులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత రాష్ట్ర పరిస్థితులు ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు ముందు చూపుతో పాలన సాగిస్తూ, పేదల సంక్షేమం రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం తను చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, అవార్డు గ్రహీతలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మదేవం హైస్కూల్లో గణతంత్ర దినోత్సవం



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ముత్తుకూరు మండలం బ్రహ్మదేవి గ్రామపంచాయతీ పరిధిలో జడ్పీ హైస్కూల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ కొత్తపల్లి రమేష్ కుమార్ శర్మ పాల్గొనడం జరిగింది. 77వ గణతంత్ర దినోత్సవ వేడుకను చాలా ఘనంగా జరుపుకున్నామని ఆయన మాటలతో చెప్పారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు ఆలూరు వెంకట విష్ణువర్ధన్ రావు హెడ్ మిస్ట్రెస్ తానియా స్కూల్ కమిటీ చైర్మన్ మహేష్ బాబు సీనియర్ నాయకులు గ్రామస్తులు పెద్దలు అంకయ్య దాసరి శ్రీనివాసులు మారు బోయిన వెంకటరమణయ్య మాది ఎంపీటీ నన్ను దీనయ్య నెల్లూరు పాపయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూర్‌లో మండల పరిషత్ అధ్యక్షురాలు వనిపెంట హేమావతి ఆధ్వర్యంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక బంగ్లా సెంటర్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎంపీపీ హైమావతి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల ప్రజలందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. భారత రాజ్యాంగ గొప్పతనాన్ని ఆమె కొనియాడారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వలనే నేడు దేశ ప్రజలందరికీ సమాన హక్కులు స్వేచ్ఛ లభిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగ బద్ధమైన బాధ్యతలను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వనిపెంట వెంకట సుబ్బారెడ్డి తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు గురజాల గోపి మండల ప్రధాన కార్యదర్శి చల్లా శ్రీనివాస్ యాదవ్ సొసైటీ డైరెక్టర్ కోదూరు నాగిరెడ్డి తెలుగుదేశం పార్టీ ఎస్ఎస్ఎల్ మాజీ నాయకులు ఆరికొండ శ్రీనివాసులు మండల కో ఆప్షన్ నెంబర్ రఫీ సొసైటీ మాజీ డైరెక్టర్ కర్ణం శ్రీనివాస నాయుడు ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## నిడిగుంటపాలెంలో ఘనంగా గణతంత్ర దినోత్సవం

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** నిడిగుంటపాలెంలో జడ్పీ హైస్కూల్, హెల్మెట్రీ స్కూల్, గ్రామ సచివాలయంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం విద్యార్థులకు స్వీట్లు, పళ్ళు, చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు, సాగునీటి సంఘం అధ్యక్షులు కుంచి శ్రీనివాసులు యాదవ్ స్వతంత్ర సమరయో ధుల త్యాగాలను విద్యార్థులు గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు హస్నాపురం శ్రీనివాసులు, స్కూల్ చైర్మన్ గిరి సునీతమ్మ, బీజేపీ నాయకులు, పాఠశాల-సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## కోర్టులో గణతంత్ర వేడుకలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు కోర్టులో సోమవారం భారత్ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి బి.గాయత్రి జాతీయ జెండాను ఎగురవేసి స్వాతంత్ర్య ఉద్యమం, గణతంత్ర దినోత్సవ ప్రాధాన్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి ఎల్.జగదీష్, బార్ అధ్యక్షురాలు కె.వెంకటరమణమ్మ, బార్ మెంబర్లు, న్యాయవాదులు, కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు మండల తాహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ అనిల్ కుమార్ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ప్రసన్నకుమారి పోలీస్‌స్టేషన్లో ఎస్సై ఏ సైదులు జాతీయ జెండాను ఆవిష్కరించారు అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ లక్ష్మీ నరసింహస్వామి బీసీ బాలుర హాస్టల్లో వార్డెన్ షేక్ రియాజ్ జాతీయ జెండాను ఎగురవేశారు ఈ సందర్భంగా విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. అలాగే గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు అలాగే మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో సచివాలయాల్లో పాఠశాలల్లో గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జాతీయ జెండాను ఎగరవేశారు.

# వీఎస్‌యూలో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవం

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ప్రాంగణంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు దేశ స్వాతంత్ర్యం అమరవీరుల అపార త్యాగాల ఫలితమని పేర్కొన్నారు. నేటి స్వేచ్ఛ, గణతంత్ర పాలన వెనుక ఎందరో మహనీయుల ప్రాణత్యాగాలు దాగి ఉన్నాయని అన్నారు. కవి ప్రదీప్ రచించిన, గాన కోకిల లతా మంగేష్కర్ ఆలపించిన 'ఏ మేరే వతన్ కే లోగో' పాటను ప్రస్తావిస్తూ, దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరులను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. బ్రిటిష్ పాలనలో భారతీయులు ఎదుర్కొన్న వివక్ష, అన్యాయాలను వీసీ వివరించారు. 1919 భారత ప్రభుత్వ చట్టంలో ద్వంద్వ పాలన విధానం ద్వారా కీలక శాఖలను బ్రిటిష్ వారు తమ ఆధీనంలో ఉంచుకుని, భారతీయులకు పరిమిత అధికారాలే ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే పరిమిత ఓటుహక్కు, సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాలు, 1929 లాహోర్ కాంగ్రెస్ సమావేశంలో పూర్ణ స్వరాజ్ లక్ష్యంగా నిర్ణయం తీసుకున్న చారిత్రక ఘట్టాలను వివరించారు. 1930 జనవరి 26న




స్వాతంత్ర్య దినంగా ప్రకటించుకోవడమే నేటి గణతంత్ర దినోత్సవానికి పునాది అని అన్నారు. విప్లవ మార్గంలో దేశం కోసం ప్రాణాలు అర్పించిన లాలా లజపత్ రాయ్, భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు, జతీంద్రనాథ్ దాస్ వంటి మహావీరుల త్యాగాలను వీసీ ప్రత్యేకంగా స్మరించారు. నాటి వీరుల త్యాగ స్ఫూర్తితో విద్యార్థులు దేశ సేవకు అంకితమవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. కె.సునీత, కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సిహెచ్. విజయ విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. అలాగే వివిధ విభాగాల అధిపతులు, అధికారులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.

# సృష్టిలో అతి ముఖ్యమైనది విలువైనది స్నేహం ఒక్కటే



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో అమెరికన్ బాప్టిస్ట్ మిషనరీ ఉన్నత పాఠశాలలో 1990-91 పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కావలి రామ్మూర్తి పేటలో కలయిక కళ్యాణ మండపం నందు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఏబీఎం పాఠశాల ఉపాధ్యాయులు హాజరయ్యారు. విద్యా నేర్పించిన ఉపాధ్యాయులందరినీ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ నేపథ్యంలో సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా పూర్వ విద్యార్థులైన ప్రస్తుత ప్రభుత్వ ఉపాధ్యాయులు లాలం. మాధవరావు, మాజీ సర్పంచ్ నక్క మాధవరావు తమ గానంతో వీనులు విందుగా పాడి అలరించారు. అదే విధంగా నెల్లూరు నుండి విచ్చేసిన చిన్నారి నల్లభోతుల శాన్విక అద్భుతంగా కూచిపూడి నృత్య ప్రదర్శన కనులు విందుచేసింది. పూర్వం తమ విద్యార్థులు అందరూ తమ చిన్ననాటి జ్ఞాపకాలని నెమరు వేసుకోని, వచ్చిన గురువులను శాలువాతో సత్కరించి గౌరవంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సృష్టిలో విలువైనది ఎన్నటికీ మర్చిపోలేనిది స్నేహం ఒకటేనని తను పాఠశాలలో అల్లరి చేష్టలను గురువులు తమను ఏ విధంగా పాఠశాలలో చదువుల విషయంలో క్రమశిక్షణ ఉన్నప్పుడు ఎలా ఉన్నామో ఒకసారి జ్ఞాపకం చేసుకొని ఆనందంగా ఈ కార్యక్రమాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమ నిర్వాకులు డాక్టర్ బి.రవి కుమార్, డి.సునీల్ రాజ్, ఎన్.మాధవరావు, దిలీప్ కుమార్ రాయపాటి, లాజర్ మస్తాన్, ఏ.కోటేశ్వరరావు, సి.హెచ్. కోటేశ్వరరావు, మనోజ్, సుభాషిని, పరిమళ, కృప వాణి, వనజ, మహిత, ఉమా, పుష్పలత, సౌభాగ్యం, తదితర సహ విద్యార్థులు పాల్గొని ఆనందంతో సంతోషంతో పూర్వ జ్ఞాపకాలతో ముగించారు.

# ఘనంగా గణతంత్ర దినోత్సవం

**మనుబోలు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన మనుబోలులో సోమవారం 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. తాసిల్దార్ కార్యాలయం మండల ప్రజా పరిషత్ కార్యాలయం వెలుగు పోలీస్ స్టేషన్ కరెంట్ ఆఫీస్. హై స్కూల్ జూనియర్ కాలేజీ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి చోట జాతీయ జెండాను ఎగరవేసి రిపబ్లిక్ డే ప్రాధాన్యతను వివరించారు. ముందుగా తాసిల్దార్ కార్యాలయం వద్ద జాతీయ జెండాను తాసిల్దారు ఈగ రమాదేవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 1950 సంవత్సరం జనవరి 20వ తేదీ సంపూర్ణ స్వాతంత్రం వచ్చినందునే రిపబ్లిక్ డేగా జనవరి 26వ తేదీన జరుపుకుంటున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఏడబ్ల్యు స్కూల్ విద్యార్థులు చిన్నారులు వచ్చి వందేమాతరం గీతం ఆలపించారు. ఎస్సై శివ రాకేష్ ఈసారి రిపబ్లిక్ డే వేడుకలకు విచ్చేశారు. తాసిల్దార్ రమాదేవి జండా ఆవిష్కరించిన వెంటనే జండా వందనం చేశారు. అలాగే మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.జలజాక్షి సమక్షంలో జెండాను



ఆవిష్కరించారు. తాసిల్దార్ కార్యాలయం వద్ద డిటి ప్రదీప్ కుమార్ సమక్షంలో ఆర్ఐ అరుణ్ తేజ విఆర్వోలు నాగార్జునరెడ్డి. నాగేంద్ర గుణశేఖర్ మురళీధర్ బుజ్జయ్య వెంకయ్య బల్లి శ్రీనివాసులు సురేంద్ర. డీలర్లు ఏ కేశవ్. ఉచ్చురు దయాకర్ రెడ్డి. గిద్దంటి పెంచలయ్య.సురేష్ రమణయ్య. శేషయ్య. నాగార్జున. టీచర్లు పద్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే పోలీస్ స్టేషన్లో ఎస్సై శివ రాకేష్ సమక్షంలో జాతీయ జెండాను ఎగరవేసి విద్యార్థులకు చాక్లెట్లు పంచిపెట్టారు. తెలుగు కార్యాలయంలో ఏపీఎం వనజాక్షి సిసిలు వెంకటేశ్వర్లు శ్రీనివాసులు పార్వతి గణతంత్ర వేడుకలు జరుపుకున్నారు.



# ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇరువురికి తీవ్ర గాయాలు

**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** జాతీయ రహదారిపై మలుపు తిరుగుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలో జాతీయ రహదారి 565 పై సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రమైన వరికుంటపాడుకు చెందిన అంద్రా బాల గురువారెడ్డి ద్విచక్ర వాహనంపై పొలంలోకి వెళ్లేందుకు మలుపు తిరుగుతుండగా ప్రకాశం జిల్లా పొదిలి చెందిన సయ్యద్ బాషా కడప నుండి పొదిలికి ద్విచక్రంపై వెళుతుండగా మార్గమధ్యలో ఎంపీడీవో కార్యాలయం సమీపంలో బాల గురువారెడ్డి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాల గురవా రెడ్డికి కాలు విరగడంతో పాటు చేతి వేలు తీవ్రత రక్త గాయాలు అయ్యాయి. సయ్యద్ భాషకు చెయ్యి విరిగింది. స్థానికులు 108కి సమాచారాన్ని ఇవ్వడంతో బాల గురవారెడ్డిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మెరుగైన వైద్యం కోసం నెల్లూరు ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. సయ్యద్ భాషను పామూరు వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఎస్ఐ ఎం. రఘునాథ్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి వాహనాలను స్టేషన్ కి తరలించారు.

# కాలెండర్‌ను ఆవిష్కరించిన ఎంపీ వేమిరెడ్డి



**నెల్లూరు అర్బన్/క్రైం మేజర్‌న్యూస్ :** దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో వేర్వేరు పేర్లతో పిలవబడుతున్న రాష్ట్రకూటులు, రెడ్డి బిడ్డలను ఏకతాటిపై నిలిపేందుకు ఏర్పాటైన రాష్ట్రకూట రెడ్డి సేవా సమూహం నూతన సంవత్సరం కేలండర్‌ను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తన చేతులు మీదుగా సోమవారం నెల్లూరులోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్రకూట రెడ్డి సేవా సమూహం జాతీయ అధ్యక్షులు జడ్డు రమణారెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల జాతీయ స్థాయిలో జరిగిన రెడ్డి సమ్మేళనంలో దక్షిణ భారత దేశంలో ఉన్న ఏడు రాష్ట్రాలలోని రెడ్డి వర్గీయులు హాజరయ్యారని, ఉత్తర భారతదేశంలో రాష్ట్రకూటులుగా పిలవబడుతున్న రెడ్డిలను కూడా కలుపుకొని సేవా సమూహంను బలోపేతం చేస్తామని జడ్డు రమణారెడ్డి ఎంపీకి వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రకూట రెడ్డి సేవా సమూహం జాతీయ అధ్యక్షులు జడ్డు రమణారెడ్డి, జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ ద్వారం వేణుగోపాల్ రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సి.శ్రీనివాసులు రెడ్డి, సంయుక్త రాష్ట్రంలో కార్యదర్శి వరికూటి వెంకట రమణారెడ్డి, రెడ్డి సంఘం నాయకులు డాక్టర్ పోలంరెడ్డి సందీప్ చైతన్య రెడ్డి, జనసేన నాయకులు కేతంరెడ్డి వినోద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు

**కావలి, మేజర్‌న్యూస్ :** 77వ గణతంత్ర వేడుకలను సోమవారం కావలి వైసిపి కార్యాలయంలో ఘనంగా నాయకులు కార్యకర్తలు, అభిమానుల మధ్య నిర్వహించారు. మొదటిగా జెండా ఆ విషయం కార్యక్రమాన్ని నిర్వహించి అనంతరం వక్తలు మాట్లాడుతూ.. సమాజంలో నేటి యువత వ్యసనాలకు దూరంగా దేశభక్తిని పెంపొందించుకోవాలని దేశ ప్రగతికి తోడ్పాటు అందించాలని తెలిపారు. 77వ గణతంత్ర దినోత్సవ స్ఫూర్తితో స్వాతంత్ర సమరయోధులు భారత రాజ్యాంగ నిర్మాతలు కన్నా కలలు నవ సమాజాన్ని నిర్మించాలని వారు కోరారు. వారి స్ఫూర్తితో ముందుకు పోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి కావలి పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, మండల ప్రెసిడెంట్ కొండమ్మ గంధం ప్రసన్నాంజనేయులు, పందింటి కామరాజు, షేక్ సాహుల్, వెంకటనారాయణ కావలి వైసీపీ రూరల్ అధ్యక్షులు వాయిల తిరుపతి, రాజశేఖర్ కుందుర్తి కామయ్య, కలికి శ్రీనివాసులురెడ్డి, గుడ్లూరు మాల్యాద్రి, చిన్న పుల్లయ్య, దాంశెట్టి సుధీర్ నాయుడు, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, నాగాచారి, గుర్రం వెంకటేశ్వర్లు, పరుసు మాల్యాద్రి, ఆర్కే కృష్ణారెడ్డి, చెన్ను ప్రసాద్‌రెడ్డి, పామాంజి రవిబాబు, అక్కిలిగుంట మల్యాద్రి, వైసిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర డైరెక్టర్ అబ్బూరి



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** నెల్లూరులోని ఏపీ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ రాష్ట్ర డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అబ్బూరి రమేష్ నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యాలయంలో జాతీయ జెండాను జిల్లా అధికారులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ప్రత్యేక సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న ఎడ్యుకేషనల్ మరియు వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధికి సంబంధించిన పలు ప్రాజెక్టులు వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కు చెందిన జిల్లా అధికారులు, ఈఈలు, డిఈలు, ఏఈలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు అలాగే రాష్ట్ర డైరెక్టర్ అబ్బూరి రమేష్ నాయుడును శాలువా కప్పి బొకే అందజేసి సత్కరించారు.

## గణతంత్ర దినోత్సవ వేడుకలు



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంలోని పీఏసీఎస్ (సొసైటీ)లో చైర్మన్ రావూరు రాధాకృష్ణమ నాయుడు ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కట్టంరెడ్డి రాధాకృష్ణ రెడ్డి, సర్వేపల్లి కెనాల్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ చల్లా నాగార్జున రెడ్డి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ వల్లెపు మునుస్వామి తదితర నాయకులు పాల్గొన్నారు. పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సీనియర్ జర్నలిస్ట్ వెంకటసుబ్బయ్యకు ఆత్మీయ సన్మాన సత్కారం



- అక్రిడేషన్ కమిటీలో సభ్యులుగా నియామకంపై ? సూర్య దినపత్రిక కుటుంబం హర్షం
- నిబద్ధతకు మారుపేరు వెంకటసుబ్బన్న
- సూర్య బ్రాంచ్ మేనేజర్ రవితేజ
- జర్నలిస్టు సమస్యల పరిష్కారానికి కృషి
- జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులు సోమా వెంకటసుబ్బయ్య



**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** సీనియర్ పాత్రికేయులు, రచయిత, ఏపీయు డబ్ల్యూజే జిల్లా వైస్ ప్రసిడెంట్, నేటి దినపత్రిక సూర్య ఆత్మకూరు డివిజన్ ఇన్‌చార్జి సోమా వెంకటసుబ్బయ్యకు జిల్లా అక్రిడేషన్ కమిటీలో సభ్యులుగా నియామకంతో స్థానం కల్పించబడిన శుభ సందర్భాన్ని పురస్కరించుకొని సోమవారం నగరంలోని కొండాయపాలెం గేట్ ప్రాంతంలో ఉన్న పాత మిలటరీ కాలనీ లోని సూర్య దినపత్రిక జిల్లా ప్రాంతీయ కార్యాలయంలో బ్రాంచ్ మేనేజర్ ఏ.రవితేజ అధ్యక్షతన ఆత్మీయ సన్మాన సత్కార కార్యక్రమాన్ని సూర్య కుటుంబ సభ్యుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత నేటి దినపత్రిక సూర్య జిల్లా బ్రాంచ్ మేనేజర్ ఏ.రవితేజ మాట్లాడుతూ.. నీతి నిజాయితీలతోపాటు నిబద్ధత కలిగిన జర్నలిస్టుగా విశేష ఆదరాభిమానాలను చూడకుంటున్న ఆత్మకూరు డివిజన్ సూర్య దినపత్రిక ఇన్‌చార్జ్ సోమా వెంకటసుబ్బయ్య జిల్లా అక్రిడేషన్ కమిటీలో సభ్యులుగా నియమితులు కావడం సంతోషదాయకమన్నారు. కుల మత ఇతర రాజకీయ పార్టీలకు అతీతంగా స్వచ్ఛమైన, అర్థవంతమైన రీతిలో పరిశోధిత కథనాల ద్వారా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలోనూ, సమస్యలను సామరస్యంగా పరిష్కరిస్తూ విజయపథంలో ముందుకెళుతున్న వెంకటసుబ్బన్న లాంటి వ్యక్తి పత్రిక ప్రపంచానికి తలమానికం లాంటి వారని, 40 ఏళ్ల సుదీర్ఘ జర్నలిస్ట్ ప్రస్థానంలో వెంకటసుబ్బన్న మచ్చలేని ఉత్తమ కథనాల ద్వారా అన్ని వర్గాల పాఠకులకు చేరువయ్యారని అలాంటి మహోన్నత వ్యక్తిత్వం కలిగిన వెంకటసుబ్బన్న సూర్య దినపత్రికలో ఆత్మకూరు డివిజన్ ఇన్‌చార్జ్‌గా సేవలందిస్తున్నందుకు గర్వకారణంగా ఉందన్నారు. పత్రికా రంగానికే వన్నెతెచ్చిన వెంకటసుబ్బన్న భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు పొందాలని, సంపూర్ణ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులు సోమ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ.. జిల్లా అక్రిడేషన్ కమిటీలో సభ్యుడిగా నియమించినందుకు కలెక్టర్, జర్నలిస్ట్ యూనియన్ల నాయకులకు, తోడ్పాటునందించిన సహచర మిత్రులకు పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా వైస్ ప్రెసిడెంట్ గానూ, అక్రిడేషన్ కమిటీ సభ్యుడు గాను సమర్థవంతమైన పాత్ర పోషిస్తానని, జిల్లాలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని, అదేవిధంగా అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు మంజూరయ్యే విధంగా కృషి చేస్తానని ఆయన తెలిపారు. నేటి దినపత్రిక సూర్య ఆత్మకూరు డివిజన్ ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్న తనను అన్ని విధాల వెన్నంటే ఉండి ప్రోత్సహిస్తున్న బ్రాంచ్ మేనేజర్ రవితేజ సారథ్యంలో సూర్య దినపత్రిక ప్రస్థానాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. బ్రాంచ్ మేనేజర్ రవితేజ అందిస్తున్న సహకారం మరువలేనిదని అలాగే సూర్య దినపత్రిక లో చక్కటి కుటుంబ నేపద్య వాతావరణం ఉండటం చాలా సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా జర్నలిస్టులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యుడుగా నియమిత్రుడినైన తనను ఆత్మీయ సన్మాన సత్కారాలతో గౌరవించిన సూర్యా బ్రాంచ్ మేనేజర్ రవితేజకు, సహచర మిత్రులకు పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్య దినపత్రిక కుటుంబ సభ్యులు ఏంవి చంద్రశేఖర్, పట్టపల్లి నాగరాజు, ఎస్‌డీ మహమ్మద్ రఫీ, ఆత్మకూరు డివిజన్ సూర్యటీం జయరాం రెడ్డి, సుధాకర్, అరవింద్, సంజీవరెడ్డి, సురేంద్ర, శివ ప్రసాద్, విజయ్‌కుమార్ రెడ్డితో పాటు ఉదయ్ కుమార్, అంబటి సురేష్, దేవళ్ళ పోలయ్య, వీర కుమార్, శశి కుమార్, చిన్మయరెడ్డి, మల్లికార్జున, టీవీ రావు, పెంచన నరసింహ, జయకర్‌బాబు, వెంకటేశ్వర్లు, పద్మావతి, వెంకటేశ్వర్లు, రవి, రామచంద్రయ్య, కామేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మర్రిపాడు తహసిల్దార్‌కు ఉత్తమ పురస్కారం



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం నెల్లూరు నగరంలోని పోలీస్ ఫెరర్ గ్రౌండ్లో నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో మర్రిపాడు మండల తాసిల్దార్ అనిల్ కుమార్ యాదవ్?కు ఉత్తమ పురస్కారం లభించడం పట్ల మండల ప్రజలు హర్ష వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఈ అవార్డును ఆయన అందుకున్నారు. పరిపాలనా సేవల్లో నిబద్ధత, ప్రజల సమస్యలపై స్పందించే తత్వం, పారదర్శకమైన పాలన, ముఖ్యంగా సామాన్య ప్రజల పట్ల చూపుతున్న మానవీయ దృక్పథానికి గుర్తింపుగా ఈ అవార్డుకు ఎంపికైనట్లు అధికారులు పేర్కొన్నారు. తాసిల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మర్రిపాడు మండలంలో భూ సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలులో వేగం తీసుకురావడంలో ఆయన ప్రత్యేక కృషి చేశారని ప్రజలు ప్రశంసిస్తున్నారు. కేవలం అధికారిగా మాత్రమే కాకుండా, సేవా దృక్పథంతో మనసున్న మనిషిగా ప్రజల మధ్య కలిసిపోతూ పనిచేయడం ఆయన నైజం. కార్యాలయానికి వచ్చే ప్రతి వ్యక్తిని గౌరవంగా పలకరించడం, సమస్యను తన సమస్యగా భావించి పరిష్కారం దిశగా అడుగులు వేయడం వల్ల ఆయనకు ప్రజల్లో విశేష ఆదరణ లభించింది. ఈ సందర్భంగా మర్రిపాడు మండల వాసులు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, 'ఇలాంటి ఉత్తమ సేవా అవార్డులు మరెన్నో అందుకోవాలని, భవిష్యత్తులో ఉన్నతాధికారిగా మరిన్ని కీలక పదవులు అలంకరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం' అని చర్చించుకున్నారు. ఆయన సేవా ప్రయాణం యువ అధికారులకు, సమాజానికి ఆదర్శంగా నిలవాలని పలువురు ఆకాంక్ష వ్యక్తం చేశారు. మండలానికి పేరు తీసుకొచ్చిన ఈ ఘనత మర్రిపాడు ప్రజలందరికీ గర్వకారణమని, ప్రజాసేవే లక్ష్యంగా పనిచేసే అధికారులు ఇంకా ముందుకు రావాల్సిన అవసరం ఉందని ఈ అవార్డు చాటి చెబుతోందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

## ఉత్తమ కమిషనర్‌గా వైఓ నందన్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో ఏర్పాటుచేసిన అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ విధుల నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను నగర పాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్, ఇంజనీరింగ్ విభాగం ఈ.ఈ శేషగిరిరావు, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, శానిటరీ ఇన్స్పెక్టర్ అశోక్, పబ్లిక్ హెల్త్ వర్కర్ పెంచలమ్మ, యు.జి.డి వర్కర్ ప్రభాకర్ లు నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలను సోమవారం అందుకున్నారు.

## ఉత్తమ అధికారిగా ఆత్మకూరు ఆర్డీఓ పావనికి అవార్డు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** విధి నిర్వహణలో ఆత్మకూరు ప్రాంత ప్రతిష్టతను పెంచి ౹ా4 పథకం ద్వారా నిరుపేదల కళ్ళల్లో ఆశాజ్యోతి వెలిగించి జిల్లా అధికారుల ప్రశంసలు పొందిన ఆత్మకూరు ఆర్డీవో భూమి రెడ్డి పావని భారత ఘనతంత్ర దినోత్సవ జిల్లా ఉత్తమ అధికారిణి అవార్డు పొందారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్ల ద్వారా ఉత్తమ అధికారిగా ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్డీఓ) బి.పావని అవార్డ్ స్వీకరించారు. ఆమె అత్యంత చిత్తసుద్ధిగా విధులు నిర్వహిస్తూ అటు అధికారుల, ఇటు ప్రజల మన్ననలు పొందారు. ఆమె గత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కూడా జిల్లా ఉత్తమ ఆర్డీవో అవార్డును మంత్రి పొంగూరు నారాయణ చేతులమీదుగా స్వీకరించారు. ఆత్మకూరు డివిజన్‌లోని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు ప్రజలు హృదయపూర్వక అభినందన శుభాకాంక్షలు తెలిపారు. ఆత్మకూరు ప్రాంతంలో ఉద్యోగరీత్యా పనిచేస్తూ వరుసగా రెండవసారి అవార్డు అందుకోవడం ఈ ప్రాంత ప్రజలకు లభించిన గౌరవంగా భావిస్తూ మరింతగా అంకితభావంతో విధులు నిర్వహించాలని, రాష్ట్ర స్థాయి అవార్డులు పొందాలని వారు ఆకాంక్షించారు.

## ఆలయంలో గణతంత్ర దినోత్సవం



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు దుర్గామిట్టలో వేంచేసియున్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు సోమవారం 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జెండా వందనం కార్యక్రమం జరిగింది. అనంతరం దేవస్థాన కార్యనిర్వహణాధికారి మాట్లాడుతూ.. జనవరి 26,1950వ సంవత్సరంలో మొదటి గణతంత్ర దినోత్సవం జరుపు కోవటం జరిగినదని మన రాజ్యాంగాన్ని డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జవహార్లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ తదితరులశీతా కూడా ఈ రాజ్యాంగములో పాలుపంచుకొని ప్రతి ఒక్కరికి స్వేచ్ఛ, స్వాతంత్రం, సమానత్వం అందరికి ఉండాలని దేశ భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని ఈ సందర్భముగా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవస్థాన ఆలయ సహాయ కమీషనరు, కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్ధన్ రెడ్డి, దేవస్థాన ఛైర్మన్ ఏలూరు శిరీష, బిరుదోలు చంటి, చీపన తేజ, రాపూరు రాధా కుమారి, ఆలయ ప్రధాన అర్చకులు, ఎక్స్ అఫిషియో సభ్యులు సూరావఝుల రఘురామమూర్తి, వేదపండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గవర్నర్ తేనెటి విందులో మురళీమోహన్ రాజు



**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** 77వ గణతంత్ర దినోత్సవం సందర్భాన్ని పురస్కరించు కుని సోమవారం ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆదిత్యంతో విజయవాడలోని లోక్ భవన్ నందు ఏర్పాటుచేసిన తేనేటి విందు కార్యక్రమంలో నెల్లూరు జిల్లాకు చెందిన పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కే మురళి మోహన్ రాజు పాల్గొన్నారు. ఈసందర్భంగా యువజన సర్వీసుల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గత 19 సంవత్సరాల నుండి శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో యువతకు ఉపయోగపడే ఎన్నో స్ఫూర్తిదాయకమైన సాహిత్య, సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, యువ రచయిత కె.మురళీమోహన్ రాజు గవర్నర్ తేనెటి విందులో పాల్గొనడం పట్ల నెల్లూరు జిల్లాకు చెందిన పలువురు పాలకులు, అధికారులు, సహచర స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, మిత్రులు శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్న అరుదైన గవర్నర్ తేనెటి విందు కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేష్, నారాయణ, అచ్చం నాయుడు, కొల్లు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ స్ఫూర్తితో నగరపాలక సంస్థను ఆదర్శంగా తీర్చిదిద్దుదాం

## కమిషనర్ వైఓ నందన్



**నెల్లూరు, కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** మహనీయులు రూపొందించిన రాజ్యాంగ స్ఫూర్తితో నెల్లూరు నగర పాలక సంస్థను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుదామని, నగర పాలక సంస్థ అన్ని విభాగాల సమన్వయంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించడమే లక్ష్యంగా కృషి చేద్దామని కమిషనర్ వైఓ నందన్ ఆకాంక్షించారు. 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్యాలయం ప్రాంగణంలో సోమవారం ఎన్‌సీసీ క్యాడెట్ల కవాతుతో కమిషనర్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర పాలక సంస్థ ఇన్‌చార్జ్ మేయర్ రూప్ కుమార్ యాదవ్ హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా మహాత్మా గాంధీ, అంబేద్కర్ చిత్ర పటాలకు కమిషనర్, మేయర్‌లు పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జాతీయ జెండాను కమిషనర్ ఆవిష్కరించారు. మేయర్, కార్పొరేటర్లు, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతి పెద్దదైన లిఖిత రాజ్యాంగాన్ని భారతదేశానికి అందించి ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించిన మహనీయులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరు నిబద్ధతతో కృషి చేయాలని సూచించారు. నగర ప్రజలకు మెరుగైన జీవనాన్ని అందించేందుకు అవసరమైన ఉత్తమ సేవలను అందించేందుకు నగర పాలక సంస్థలోని ప్రతి ఒక్క సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఎందరో మహానుభావుల త్యాగాలతో సాధించిన స్వతంత్ర స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని విధుల్లో క్రమశిక్షణ పాటించాలని కమిషనర్ ఆశించారు. అనంతరం నగరపాలక సంస్థ ఇంచార్జ్ మేయర్ రూప్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ మహనీయులు రూపొందించిన ఆదర్శనీయమైన భారత రాజ్యాంగం పట్ల ప్రతి ఒక్కరు విధేయత కనబరచాలని, భారతదేశ ప్రజలందరి ఉన్నత జీవనం కోసం మహనీయులు చూపిన మార్గాన్ని ఆచరించి ఆదర్శంగా నిలవాలని కోరారు. ప్రజలందరికీ 77వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ ప్రతి ఒక్కరు స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంతో విరాజిల్లాలని మేయర్ ఆకాంక్షించారు. రిపబ్లిక్ దినోత్సవ వేడుకలలో భాగంగా నగర పాలక సంస్థలోని వివిధ విభాగాల్లో ఉత్తమ సేవలు అందించిన సిబ్బందికి కమిషనర్, మేయర్, కార్పొరేటర్లు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ లు సత్తార్ బాషా, కరిముల్లా, రామకృష్ణ, నగర పాలక సంస్థ అన్ని విభాగాల ఉన్నతాధికారులు, విభాగాల అధికారులు, వార్డు సచివాలయాల కార్యదర్శులు, ఇండోర్, ఔట్ డోర్ సిబ్బంది పాల్గొన్నారు.

# వీబీజీ రాంజీ పథకాన్ని రద్దు చేయాలని అంబేద్కర్‌కి వినతి




**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నెల్లూరు నగరంలో రాజ్యాంగదినోత్సవం సందర్భంగా విబిజి రాంజీ చట్టాన్నిరద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం గణతంత్ర దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకొని స్థానిక విఆర్‌సి సెంటర్లో ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ నాయకులు, కమిటీ సభ్యులు తమ నిరసనను తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కుట్రపన్నీ ఉద్దేశపూర్వకంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి విబిజి రాంజీ చట్టాన్ని పథకాన్ని తీసుకొచ్చిందని, ఈ పథకం ద్వారా కూలీలు పని అడిగే హక్కు కోల్పోతారని, గతంలో ఉన్న మాదిరిగా ఉపాధహామీలో ఉన్న హక్కులు ఏవి ఉండవని, ప్రభుత్వం దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఎప్పుడు పని కల్పిస్తే అప్పుడు పని చేసుకోవాల్సిన పరిస్థితి ఉంటుందని, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని అసలు లేకుండా చేయడానికి ఈ రాంజీ పథకం తెచ్చారని వెంటనే ఈ రాంజీ పథకాన్ని రద్దు చేసి పాత ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య, జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకమ్మ రాజు, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.మోహన్ రావు, పాదర్తి మస్తానయ్య, జిల్లా కమిటీ సభ్యులు శ్రీపతి వెంకయ్య, కెవిపిఎస్, జిల్లా కార్యదర్శి ఆలూరు తిరుపాలు, అధ్యక్షుడు నూతలపాటి రఘురామయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఓడురుదూరు వెంకట కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే..

# నేడు మన ముందున్న కర్తవ్యం : కేవీపీఎస్




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** మతోన్మాదం నశించాలని, మనువాదాన్ని నిర్మూ లించాలని కోరుతూ కెవిపిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పిఆర్సి సెంటర్లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి అనంతరం రాజ్యాంగ పీఠికను చదివి ప్రతిజ్ఞ కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నేలపాటి రఘురామయ్య ఆలూరు తిరుపాలు మాట్లాడుతూ.. వ్యవస్థల్ని సంస్థలని ధ్వంసం చేస్తూ, ప్రభుత్వమే మతోన్మాద పోకడలను అనుసరిస్తూ, ప్రజల హక్కులను కాలరాస్తున్న నేటి తరుణంలో రాజ్యాంగం లోని మూల స్తంభాలైన ప్రజాస్వామ్యం, లౌకిక తత్వం, సమాఖ్య వ్యవస్థ, సామాజిక న్యాయం కొనసాగాలంటే రాజ్యాంగాన్ని కాపాడుకుంటేనే ఇది సాధ్యమవుతుందని, వీరి ఆగడాలను అడ్డుకోగలమని దానికోసం అందరినీ కలుపుకొని పోరాటం సాగించడమే నేటి మన ముందున్న కర్తవ్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం పుల్లయ్య, నాయకులు ఎం మోహన్ రావు, జే.వెంకమరాజు, కెవిపిఎస్ నాయకులు పాదర్తి మస్తానయ్య, శ్రీపతి వెంకయ్య, నూకలపాటి మోహన్, పసల వెంకటరమణయ్య, పల్లం వెంకయ్య, అట్రాసిటీస్ మానిటరింగ్ కమిటీ మెంబర్ శేషం సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# కారు లారీని ఢీ కొని ఏడుగురికి తీవ్ర గాయాలు



**వరికుంటపడు, మేజర్‌న్యూస్ :** కారుని ఢీ కొని ఏడుగురికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని జడదేవి సమీపంలోని జాతీయ రహదారి 565 పై సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలమేరకు రాజమండ్రి ఆలమూరు ప్రాంతానికి చెందిన కుటుంబశీ బెంగుళూరులోని ఓ వివాహానికి హాజరు అయ్యి తిరుగుప్రయణంగా కారులో వెళ్తుండగా మార్గమధ్యలో జడదేవి సమీపంలో ప్రమాదవశాత్తు లారీని ఢీ కొట్టింది. దీంతో లారీలో ప్రయాణిస్తున్న ఏసుదాస్, ఆనంద్, జాయిష్, పూన్నమ్మ, పద్మ, దాసు, బేబి కి తీవ్ర గాయాలైయాయి. 108 సహాయం తో గాయపడినవారిని ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కారు భాగం నుజ్జు నుజ్జు అయింది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

# ఘనంగా గణతంత్ర దినోత్సవం



**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి మండలంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. జలదంకి కార్యాలయంలో తాసిల్దార్ సీతామహాలక్ష్మి, జలదంకి పోలీస్ స్టేషన్లో ఎస్ఐ లతిపున్నిసా, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో బ్రహ్మయ్య, అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో కార్యాలయాల్లో మువ్వన్నెల జెండాలు ఎగురవేశారు. జలదంకి రచ్చ బండ వద్ద పంచాయితీ ఉపసర్పంచ్ కూరపాటి మాలకొండ రెడ్డి భారీ కేక్ ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా మాల కొండారెడ్డి మాట్లాడుతూ.. 1950 జనవరి 26వ తేదీన భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన దేశ ప్రజలకు పూర్తి స్వేచ్ఛ హక్కులు వచ్చాయన్నారు. అందువలననే ఈరోజును గణతంత్ర దినోత్సవంగా చేసుకుంటున్నామన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, దేశ రాష్ట్ర అభివృద్ధి కోసం పని చేస్తుంటే, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. మంచి నాయకుడిని ఎన్నుకోవడం వల్లనే ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలకు పనులు చేసే, అభివృద్ధి చేసే వారిని ఎన్నుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండలం కేంద్రంలో జడ్పీ హైస్కూల్ నందు రిపబ్లిక్ డే వేడుకలను ఎంతో ఘనంగా నిర్వహించారు. మొదట జడ్పీ హైస్కూల్‌లో జెండాను ఎగరవేసి అనంతరం జడ్పీ హైస్కూల్‌లో చుట్టు ప్రక్కల ప్రాంతాలలోని ప్రజలందరికీ కూడా గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలను తెలియపరిచి వారికి జెండాలను కుట్టి చాక్లెట్లను పంచి పెట్టడం జరిగింది. దానితో మరొక్కసారి అందరికీ మన యొక్క రాజ్యాంగం అమలులోకి వచ్చిన తేది జనవరి-26ను గుర్తు చేయడం జరిగింది. అలాగే జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు మాట్లాడుతూ.. గణతంత్ర దినోత్సవం జనవరి-26 భారతదేశం లోని రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజు అని, ఇది జాతీయ పండుగ అని కుల మతాలు, బేధాలు లేకుండా సమానంగా జరుపుకునే అత్యంత గొప్ప పండుగ అని ఆమె తెలియజేశారు. అలాగే ఎన్ని బేధాలున్నా, మాకెన్ని తేడాలున్నా దేశమంటే ఏకమవుతాం అని ఈ వేళ ప్రజలందరికీ తెలిసేతట్టు సైదాపురం మండలంలోని ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు కలిసి ఈ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు, ప్రధాన ఉపాధ్యాయులు, స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ కుంచం నీరజ, ఉపాధ్యాయులు స్కూల్ విద్యార్థులు, ఇతరులు పాల్గొన్నారు.

# ఘనంగా రిపబ్లిక్ డే వేడుకలు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని ఏసిఎస్ఆర్ కాలనీ సచివాలయంలో సోమవారం ఘనతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. 1950. సంవత్సరం. జనవరి 26 తేదీన భారత ప్రభుత్వం చట్టానికి బదులు భారత రాజ్యాంగం దేశ పరిపాలనకు మార్చడమే భారత గణతంత్ర దినోత్సవమని కౌన్సిలర్ సూరా భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. ఈరోజు భారతదేశ ప్రజలందరూ కూడా ఈ గణతంత్ర వేడుకలను. ఎంతో ఆనందకరంగా జరుపుకుంటున్నారన్నారు. ఆత్మకూరు మున్సిపాలిటీలోని 17, 18, 20వ వార్డులకు సంబంధించిన ఏసిఎస్ఆర్ కాలనీలోని సచివాలయంలో 20వ వార్డు కౌన్సిలర్. సురా. భాస్కర్ రెడ్డి, సచివాలయ అడ్మిన్. మోహిసాన జెండాను ఆవిష్కరింప చేయడం జరిగింది. అనంతరం. ఈ వేడుకలను గురించి మన స్వాతంత్ర సమరయోధుల గురించి వారు చేసిన త్యాగాలను గురించి మాట్లాడడం జరిగింది. ఈ వేడుకలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్, సర్దార్ 20 వార్డ్. నాయకులు. చిన్నబ్బాయి అధ్యక్షులు శ్రీనయ్య 19. వార్డ్. అధ్యక్షులు హీనహితులా నాయకులు. మనోహర్ సచివాలయ సిబ్బంది పాల్గొని అనంతరం స్వీట్లు పంచి సంతోషంగా ఈ వేడుకలు జరుపుకున్నారు.

# పారిశ్రామిక అభివృద్ధిలో ఏకేపీఎల్‌కు అవార్డులు

**కృష్ణపట్నం పోర్టు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జగదీష్ పటేల్**

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** పారిశ్రామిక అభివృద్ధిలో కృష్ణపట్నం పోర్టుకు అవార్డులు రావడం సంతోషంగా ఉందని చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జగదీష్ పటేల్ అన్నారు. సోమవారం కృష్ణపట్నం పోర్టులో 77వ గణతంత్ర దినోత్సవం వేడుకలు సందర్భంగా జాతీయ జెండా ఎగరవేసి సెల్యూట్ చేశారు. అనంతరం ఆయన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. కొత్త ప్రక్రియలు, వ్యవస్థలకు కట్టుబడి కృష్ణపట్నం నౌకాశ్రయం కూడా బాగా పని చేస్తోందని తెలిపారు. కృష్ణపట్నం నౌకాశ్రయం 2025 సెప్టెంబరులో ఖనిజ కార్గో నిర్వహణలో ఒక మైలురాయిని సృష్టించినట్లు సీఈఓ వెల్లడించారు. 2025 లో అత్యధిక ఇనుప ఖనిజం, ఎరువులను కూడా నిర్వహించినట్లు సీఈవో ఈ సందర్భంగా వివరించారు. ఈ నేపథ్యంలో కృష్ణపట్నం నౌకాశ్రయం ఏపీ ఎస్ ఈ జెడ్ ఉత్తమ వినూత్న ప్రాజెక్ట్ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. 11వ కన్వెన్షన్ ఆఫ్ క్వాలిటీ కాన్సెప్ట్స్ 2025లో ఎనిమిది బంగారు పతకాలను ఏకేపీఎల్ పొందినట్లు సీఈవో ఈ వేడుకల్లో తెలిపారు.



క్యూసిఎఫ్ఐ తిరుపతిలో రైజింగ్ స్టార్ ఆర్గనైజేషన్ అవార్డుతో సత్కరించాలని అన్నారు. 19వ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఛాంపియన్ ఎన్విరాన్మెంట్ ఎక్సలెన్స్ అవార్డును గెలుచుకున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఈఓ సతీమణి చాందిని పటేల్, నాయుడు యష్ పటేల్, ఏకేపీఎల్ పరిధిలోని వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విశిష్ట సేవలకు గణతంత్ర పురస్కారం

- పలువురు పాలకులు, ఉన్నతాధికారులు, ఉద్యోగుల హర్షం..
- గణతంత్ర అవార్డు మరింత బాధ్యతను పెంచింది : పురస్కార గ్రహీత బాలసుబ్రమణ్యం



**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** తాను పనిచేసే కార్యాలయాన్ని దేవాలయంతో సమానంగాను.. వృత్తి ధర్మాన్ని దైవ సమానంగాను భావిస్తూ మనసా.. వాసా త్రికరణశుద్ధిగా అంకిత భావంతో కూడిన శాఖాపరమైన విధి నిర్వహణతో విశిష్ట సేవలు అందించినందుకు గాను జలవనరుల శాఖ(ఇరిగేషన్) నెల్లూరు రూరల్ మండలం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు నక్కల బాలసుబ్రహ్మణ్యంను సోమవారం 77వ గణతంత్ర దినోత్సవం(రిపబ్లిక్ డే) సందర్భంగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల చేతుల మీదుగా అందుకున్న ఉత్తమ ఇంజనీరు పురస్కారంతో అరుదైన గౌరవం లభించింది. జలవనరుల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు నక్కల బాలసుబ్రమణ్యం సేవలకు బెస్ట్ ఇంజనీరుగా గణతంత్ర పురస్కారం స్వీకరించటం పట్ల జిల్లాకు చెందిన పలువులు ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, సహోద్యోగులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నేతలు, జల వనరుల శాఖలో అంతర్భాగమైన ఇరిగేషన్ సోమశిల తెలుగు గంగ కార్యాలయా విభాగాలకు చెందిన సిబ్బంది మిత్రులు శ్రేయోభిలాషులు కుటుంబ సభ్యులు మనస్ఫూర్తిగా సోమవారం హర్షం వ్యక్తం చేశారు. జలవనరుల శాఖ నెల్లూరు రూరల్ మండలంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా 2012లో ఉద్యోగ ప్రవేశం చేసిన నక్కల బాలసుబ్రమణ్యం సమర్థవంతమైన విధులతో శాఖాపరమైన ప్రగతిని సాధించి ప్రత్యేక గుర్తింపుతో ట్రాక్ రికార్డులు సొంతం చేసుకున్నారు. పారదర్శక విధి నిర్వహణకు పెద్దపేట వేసిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు బాల సుబ్రహ్మణ్యం ఆయా రాజకీయ పార్టీలకు చెందిన పాలకులు. ఉన్నతాధికారులు, రైతులు, స్థానిక ప్రజల నుంచి విశేష మన్ననలతో కూడిన ప్రశంసలు అందుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. ఈ సందర్భంగా గణతంత్ర అవార్డు గ్రహీత బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఇంజనీర్ అవార్డులు అందుకోవడం గర్వకారణంగా ఉందని, ఈ అవార్డు తన బాధ్యతను మరింతగా పెంచిందని తెలిపారు. ప్రభుత్వం అందించిన ప్రోత్సాహం, అనుక్షణ దిశ నిర్దేశిత మార్గదర్శకాలతో ఉన్నతాధికారులందించిన సహకారం, సహోద్యోగులు, సిబ్బంది రైతుల భాస్వామ్యంతో ఉత్తమ ఇంజనీరు పురస్కారంతో. అరుదైన గౌరవాన్ని గణతంత్ర దినోత్సవం రోజున పొందడం అదృష్టంగా భావిస్తున్నానని, చాలా సంతోషంగా ఉందన్నారు.

# ఇందిరా భవన్‌లో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** స్థానిక ఇందిరా భవన్లో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉడత వెంకట్రావు యాదవ్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వెంకట్రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ జాతీయోద్యమ నాయకుల త్యాగ ఫలితమే దేశంలో స్వాతంత్ర ఫలాలు అనుభవిస్తున్నామని తెలియజేశారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నారపురెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి సూచనల మేరకు ఈ కార్యక్రమం అట్టహాసంగా జరిగిందని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బాల సుధాకర్ అన్నారు. ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. రాజ్యాంగం ద్వారా ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వం సాధించుకున్నామని, నేటి పాలకుల వల్ల రాజ్యాంగం ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడిందని, ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త ,నాయకులు రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగించడంలో ప్రాణాలొడ్డి పోరాడుతామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మిఠాయిలు, చాక్లెట్లు పంచి పెట్టారు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అందరూ కలిసిమెలిసి గణతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందని పార్టీ కార్యాలయ ఇన్చార్జ్ అడ్వకేట్ సుధీర్ అన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ



జిల్లా అధ్యక్షుడు రెహమాన్, అల్లావుద్దీన్, కోవూరు మండల కాంగ్రెస్ నాయకులు మల్లీ కిషోర్ రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మోహన్, రూరల్ నాయకులు మల్లికార్జున్ రెడ్డి, ఎన్ఎస్‌యుఐ రాజా, యూత్ కాంగ్రెస్ రాజేష్, ఫజల్ దిన్, కిషోర్, బద్రి గిరీష్, నూర్జహాన్ నాగరాజు, అమీర్, తోట సాయి గోపాల్, సాగర్, షేక్ ఖాదర్ మున్నీసా, భాను ప్రసాద్, యోబు, ఉస్మాన్, నాగ మునీంద్ర, శ్రీనివాసులు, రవి, పెంచలయ్య, శ్రీనివాసులు, వెంకటేష్, చైతన్య, అభి తదితరులు పాల్గొన్నారు.

## ఏఎంసి కార్యాలయంలో ఘనంగా రిపబ్లిక్ డే

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గొట్టి గుండాల బుజ్జి రెడ్డి, సెక్రటరీ కృష్ణ ప్రసాద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, స్థానిక తెలుగు దేశం పార్టీ నాయకులు పాల్గొని జాతీయ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గొట్టి గుండాల బుజ్జిరెడ్డి మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని రచించిన మహనీయులను స్మరించుకుంటూ, స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం అనే మూలసూత్రాలను ఆచరణలో పెట్టుకుంటూ దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరం భాగస్వాములం కావాలన్నారు. ప్రజాస్వామ్య భారతదేశంలో ప్రజల సంక్షేమమే పరమావధిగా భావిస్తూ, సమాజంలో బలహీన వర్గాలకు అండగా నిలబడుతూ మన రాష్ట్రం, మనదేశం మరింత ముందుకు సాగేందుకు కలిసికట్టుగా కృషి చేద్దామని తెలియజేశారు.

## డాక్టర్ మస్తానయ్యను పరామర్శించిన నాయకులు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో చిన్నపిల్లల వైద్య నిపుణులు (అనంత్ హాస్పిటల్) డాక్టర్ గద్దగుంట మస్తానయ్య తండ్రి గద్దగుంట మస్తానయ్య రెండు రోజుల క్రితం అనారోగ్య కారణాల రీత్యా చనిపోయారు. ఈ సందర్భంగా సోమవారం ఆత్మకూరు పట్టణ వైసీపీ నాయకులు డాక్టర్ మస్తానయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు, మాజీ జడ్పిటిసి సభ్యులు ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య, పట్టణ వైసీపీ అధ్యక్షులు నాగులపాటి ప్రతాప్ రెడ్డి, యువ నాయకుడు నోటి వినయ్ కుమార్ రెడ్డి, చిల్లూరు వెంకటేశ్వర్లు, పాలేటి వెంగల్ రెడ్డి, తోడేటి మణి, గడ్డం దిలీప్, షేక్ గౌస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## మస్జీద్‌లో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవం



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** జాతీయ జెండా ముందు అన్ని కులాలు, మతాలు సమానమే అని నిరూపించారు. పొదలకూరు ముస్లింలు సోమవారం 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పెద్ద మస్జీద్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. మస్జీద్‌పై జాతీయ జెండాను ఎగరవేశారు. అనంతరం దేశభక్తి గీతాలు ఆలపించారు. స్థానికంగా వుండే చిన్నారులకు మిఠాయిలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంతర్గతంగా మనలో మనకు ఎన్ని మనస్పర్థలు ఉన్నా.. దేశం అనేసరికి అన్ని మర్చిపోయి అంతా ఒక్కటైపోతుంటామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనులకు నివాళులర్పించారు. తహసిల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శివ కృష్ణయ్య, పొదలకూరు పోలీస్ స్టేషన్‌లో సిఐ శివకృష్ణా రెడ్డి, ఎస్ఐ హనీఫ్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో నరసింహారావు, సామాజిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ప్రసాద్, వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏడీఏ శివ నాయక్ ,ఏఓ ప్రతాప్, అగ్నిమాపక కేంద్రంలో ఫైర్ ఆఫీసర్ వర కుమార్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, ట్రెజరీ కార్యాలయం ఎస్టీఓ ఖలీల్, అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ అలాగే పలు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో ఆయా పాఠశాల హెడ్మాస్టర్లు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు.

## విద్యార్థి దశ నుంచే దేశభక్తి అలవర్చుకోవాలి



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** స్థానిక శ్రీ గాయత్రి స్కూల్లో సోమవారం 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్కూల్ ఆవరణమంతా రంగురంగుల తోరణాలు కట్టారు, అలాగే రంగవల్లికలతో అలంకరించారు. కరస్పాండెంట్ చైతన్య కుమార్ రెడ్డి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం సమర్పించారు. ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే దేశభక్తిని అలవర్చుకోవాలని కోరారు. చిన్నారులు దేశభక్తి గీతాలు ఆలపించారు. మరికొంతమంది చిన్నారులు నృత్యాలు ప్రదర్శించిగా.. కొందరు స్టంట్స్ వేసి అబ్బురపరిచారు. ఉపాధ్యాయులు స్వాతంత్ర్య సాధన కోసం త్యాగాలు చేసిన దేశభక్తి నాయకుల జీవిత చరిత్ర గురించి ఉపన్యసించారు. ఆటపోటీలు, వ్యాసరచన పోటీలు, క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పదో తరగతి పరీక్షలకు సిధమవుతున్న విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు స్వీట్స్ పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రబాబు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# 77వ గణతంత్ర దినోత్సవ సంబరాలు
























*నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :*

77వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. సోమవారం ఉదయం నెల్లూరు నగరంలోని పోలీసు పరేడు మైదానంలో నిర్వహించిన గణ తంత్ర దినోత్సవ వేడుకల్లో విద్యార్థిని విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. గణ తంత్ర దినోత్సవం సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలందించిన అధికారులు, సిబ్బందికి, వివిధ రంగా ల్లో ప్రతిభచూపిన కళాకారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ ప్రశంసా పత్రాలను అందజేశారు.





